# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి, సంపుటి : 01, సంచిక : 200, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు ( 9491020055) సోమవారం - 30 - సెప్టెంబర్ - 2024


## ఒకే ఒక్క పరిష్కారం..హెజ్‌బొల్లా అంతం

### పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గుముఖం పట్టడం లేదు.



పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. హెజ్‌బొల్లాను అంతం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ గగనతల దాడులు చేస్తోంది.క్షిపణులు, రాకెట్లతో విరుచుకుపడుతోంది. లెబనాన్ సరిహద్దులో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు 600 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. సుమారు 5 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. పరిస్థితి తారస్థాయికి చేరిన నేపథ్యంలో మిగతా..2లో

## హసీనాను దించేయడం వెనక కుట్ర

### రిజర్వేషన్ల అంశం బంగ్లాదేశ్ ను నిప్పుల కుంపటిగా మార్చడంతో షేక్ హసీనా ప్రధాని పీఠం నుంచి దిగిపోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు.



వాషింగ్టన్: రిజర్వేషన్ల అంశం బంగ్లాదేశ్ ను నిప్పుల కుంపటిగా మార్చడంతో షేక్ హసీనా ప్రధాని పీఠం నుంచి దిగిపోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు.అయితే ఆమెను దించేయడం మిగతా..2లో

## తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదలం



**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ముంబై సినీనటి కాదంబరి జత్వానీ కేసు కీలక దశకు చేరకుంటోంది. తనను అక్రమంగా అరెస్ట్ చేశారని, రిమాండ్ పంపడంతో పాటు తనను, కుటుంబాన్ని కస్టడీలో పెట్టి చిత్రహింసలకు గురిచేశారంటూ నటి జత్వానీ ఇచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర డీజీపీ ద్వరకా తిరుమల రావు విచారణ చేపట్టారు.**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ముంబై సినీనటి కాదంబరి జత్వానీ కేసు కీలక దశకు చేరకుంటోంది. తనను అక్రమంగా అరెస్ట్ చేశారని, రిమాండ్ పంపడంతో పాటు తనను, కుటుంబాన్ని కస్టడీలో పెట్టి చిత్రహింసలకు గురిచేశారంటూ మిగతా..2లో

## డిక్లరేషన్ సాంప్రదాయాన్ని జగన్ పాటిస్తే బాగుంటుంది!

**దేవుడి జోలికెళితే ఏమవుతుందో జగన్ ఎన్నికల్లో చూశారన్న లోకేశ్**

**మనం ఏ మతానికి చెందినా, అన్ని మతాలను గౌరవించాలని హితవు**

**రెడ్ బుక్ పని ప్రారంభమైంది... తప్పుచేసిన వారిని వదలబోమని వార్నింగ్**

**విశాఖలో మంత్రి నారా లోకేష్ "ప్రజాదర్బార్"**



శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారం నేపథ్యంలో, మాజీ సీఎం జగన్ ఈ నెల 28న తిరుమల వెళ్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని నిర్ణయించుకోవడం తెలిసిందే. అయితే, జగన్ తన తిరుమల పర్యటన సందర్భంగా ఆలయంలో డిక్లరేషన్ ఇస్తే బాగుంటుందని ఏపీ మంత్రి నారా లోకేశ్ సూచించారు. మనం ఏమతానికి చెందిన వారమైనా అన్నిమతాలను గౌరవించాలని హితవు పలికారు. తాము చర్చి, మసీదులకు వెళ్లినపుడు వారి మత విశ్వాసాలకు అనుగుణంగా నడుచుకుంటామని స్పష్టం చేశారు. జగన్ దేవుడి జోలికి వెళితే ఏమైందో గత ఎన్నికల్లో మీరంతా చూశారు అని లోకేశ్ వ్యాఖ్యానించారు. శ్రీకాకుళంలో ఓ పాఠశాల పరిశీలన అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు. "తిరుమల వెళతానంటున్న జగన్ డిక్లరేషన్ ఇచ్చే సాంప్రదాయాన్ని పాటిస్తే బాగుంటుంది. తిరుమల లడ్డూ నాణ్యతా లోపంతో పాటు అనేక సమస్యలను భక్తులు యువగళం పాదయాత్రలో నా దృష్టికి తెచ్చారు. అధికారంలోకి వచ్చాక టీటీడీని ప్రక్షాళన చేయాలని ఈవోకు చెప్పాం. నెయ్యి సరఫరా చేసే కంపెనీ టర్నోవర్ రూ.250 కోట్లు ఉండాలన్న నిబంధనను వైవి సుబ్బారెడ్డి రూ.150 కోట్లకు తగ్గిస్తూ ఎందుకు సవరించారు? తిరుమలలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు కమిటీ వేశాం. ఆ కమిటీ విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయి. ఇప్పుడు తిరుమల లడ్డూ క్వాలిటీ బాగుందని వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా చెబుతున్నారు.

**జగన్ మాదిరి మేం పారిపోయే వ్యక్తులం కాదు!**

జగన్ లా మేం పారిపోయే వ్యక్తులం, కాదు. ఇప్పటికే పెన్షన్లు, మెగా డిఎస్సీ హామీలను అమలు చేశాం. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారు. పథకాల అమలుపై మాకు చిత్తశుద్ధి ఉంది. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం. జగన్ లా పరదాలు కట్టుకుని మేం తిరగడంలేదు. తప్పు చేయకపోతే వారు ఎందుకు భయపడ్డారు? ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలమధ్య ప్రజావేదిక నిర్వహిస్తున్నారు. మిగతా..2లో

## ఆ విషయం నేను ముందే చెప్పా

**కేసీఆర్‌ను దెబ్బ కొడితే దిమ్మతిరిగింది**

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పొలిటికల్ కెరీర్ పై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.**

**ఒక పార్టీకి చెందిన వ్యక్తిగా మీపై ముద్ర పడవద్దని, బీసీ వర్గాల నాయకుడిగా మాత్రమే రాణించగలవని నేను గతంలోనే ఆర్.కష్ణయ్యకు చెప్పానని ఈటల అన్నారు.**



బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పొలిటికల్ కెరీర్ పై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఒక పార్టీకి చెందిన వ్యక్తిగా మీపై ముద్ర పడవద్దని, బీసీ వర్గాల నాయకుడిగా మాత్రమే రాణించగలవని నేను గతంలోనే ఆర్.కష్ణయ్యకు చెప్పానని ఈటల అన్నారు. ఇది నాది అని చెప్పుకునే తృప్తి రాజకీయ పార్టీలలో ఉండదని అది కేవలం సంఘాలలో మాత్రమే ఉంటుంన్నారు. రాజకీయ పార్టీలలో కృష్ణయ్య ఇమడలేకపోతున్నారని అన్నారు. అయితే ఎంపీ పదవికి రాజీనామా చేసిన ఆర్.కృష్ణయ్య త్వరలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తానన్నారు. ఆదిశగా పార్టీ పెట్టాలని తనపై ఒత్తిడి ఉందని కూడా చెప్పారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలో ఉంటే రాణించలేవంటూ ఈటల చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారాయి. గురువారం నారాయణగూడలో బీసీ కుల సంఘాల ఐక్యత రౌండ్ టేబుల్ సమావేశంలో మిగతా..2లో

## తప్పు చేశారు కాబట్టే డిప్యూటీ సీఎం పవన్ ప్రాయశ్చిత్త దీక్ష



**తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు స్పందించారు. తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యికి సంబంధించి.. జూన్ 12 నుంచి ఏఆర్ డెయిరీ సప్లై మొదలైందని..అప్పటికే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు.**

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు స్పందించారు.గురువారం మధ్యాహ్నం ఓ ప్రముఖ మీడియా ఛానల్ తో ఆయన మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. మిగతా..2లో

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విధ్వంసమే

### హరియాణా ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



**కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు.**

**అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్న కాంగ్రెస్ హరియాణాలో పొరపాటున అధికారంలోకి వస్తే విధ్వంసం తప్పదని అన్నారు.**

సోనిపట్: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్న కాంగ్రెస్ హరియాణాలో పొరపాటున అధికారంలోకి వస్తే విధ్వంసం తప్పదని అన్నారు. అభివృద్ధి పూర్తిగా ఆగిపోతుందని, మిగతా..2లో

## జగన్ క్రిస్టియన్... తిరుమలలో డిక్లరేషన్ పై సంతకం చేయాల్సిందే



**జగన్.. చెంపలు వేసుకుని మరీ.. తిరుమల లడ్డూను తిను**

**తిరుమలలో అన్యమతస్తులు రూల్స్ పాటించాల్సిందేనన్న రఘురామ**

**శ్రీవారి పట్ల విశ్వాసం ఉందని జగన్ డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టీకరణ**

**పాప పరిహారం కోసం జగన్ ను స్వామివారు తిరుమలకు పిలిచారని వ్యాఖ్యలు**

వైసీపీ అధినేత జగన్ ఈ నెల 28న తిరుమల శ్రీవారి దర్శనానికి వెళుతున్న సంగతి తెలిసిందే. 27న ఆయన అలిపిరి నడక దారిలో తిరుమలకు చేరుకుని... 28న శ్రీవారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో జగన్ ను ఉద్దేశించి టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ క్రిస్టియన్ అనే విషయం అందరికీ తెలిసిందేనని మిగతా..2లో

## పీఎం కిసాన్ 18వ విడత తేదీ ఖరారు




**రైతులకు ఆర్థిక సహాయం అందించే కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా రైతులు ప్రతి ఏడాది రూ.6000 అందుకుంటున్నారు.**

రైతులకు ఆర్థిక సహాయం అందించే కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా రైతులు ప్రతి ఏడాది రూ.6000 అందుకుంటున్నారు.ఈ మొత్తం ఒకేసారి కాకుండా మూడు విడతల్లో రూ.2000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది కేంద్రం. అయితే ఇప్పటి వరకు రైతులు 17వ విడత డబ్బులు అందుకున్నారు. ఇప్పుడు 18వ విడత రావాల్సి ఉంది. ఈ విడత కూడా వచ్చేందుకు సమయం ఆసన్నమైంది. నవరాత్రి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు గుడ్‌న్యూస్ చెప్పింది. మిగతా..2లో

## సిరిసిల్ల నేతలన్న తరపున పోరాటానికి సిద్ధం

ఐలమ్మ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పెట్టింది

హైడ్రా బాధితులకు అండగా ఉంటాం... అక్కడకు రండి

హైడ్రా బాధితులకు బీఆర్ఎస్, పార్టీ న్యాయవిభాగం అండగా ఉంటుందన్న కేటీఆర్

బాధితులు బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ కార్యాలయానికి రావాలని సూచన

లేదంటే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను కలవాలన్న కేటీఆర్



తెలంగాణ ఆడబిడ్డలకు, మహిళలకు ఆదర్శప్రాయమైన నాయకురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కొనియాడారు .చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు, జిల్లా రజక సంఘ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో నియంతృత్వాన్ని ఎదిరించి తెలంగాణకు స్ఫూర్తినిచ్చిన అద్భుతమైన వీర వనిత ఐలమ్మ అన్నారు. అలాంటి వీరవనితతో పాటు మహనీయుల జయంతి, వర్ధంతులను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా జరపడం మొదలు పెట్టిందని గుర్తు చేశారు.చిట్యాల ఐలమ్మ జీవిత చరిత్రను మిగతా..2లో

## ఆ ధర్మాన్నే పవన్ కళ్యాణ్ పాటిస్తాడు



**తిరుమల లడ్డూ వ్యవహారం దేశ వ్యాప్తంగా దుమారం రేపుతోంది.**

**ఈ అంశంపై సినీ, రాజకీయ ప్రముఖులు స్పందిస్తూ వారి వారి అభిప్రాయాలను చెబుతున్నారు.**

**ఈ క్రమంలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు.**

తిరుమల లడ్డూ వ్యవహారం దేశ వ్యాప్తంగా దుమారం రేపుతోంది. ఈ అంశంపై సినీ, రాజకీయ ప్రముఖులు స్పందిస్తూ వారి వారి అభిప్రాయాలను చెబుతున్నారు.ఈ క్రమంలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. ఈ దీక్షపై జనసేన నేత, కొణిదెల నాగబాబు మరో ట్వీట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్‌గా మారింది. 'నీ మతంతో పాటు సాటి మతాలని గౌరవించు, మిగతా..2లో

## హసీనాను దించేయడం వెనక కుట్ర

ప్లాన్ ప్రకారం జరిగిన కుట్రే అని ఆ దేశ తాత్కాలిక సారథి, నోబెల్ గ్రహీత మహ్మద్ యూనస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన ఈ విధంగా స్పందించారు. క్లింటన్ గ్లోబల్ ఇనిషియేటివ్ వార్షిక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆ సమయంలో అక్కడ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఉన్నారు.యూనస్ మాట్లాడుతూ.. విద్యార్థి నాయకులు బంగ్లాదేశ్‌కు కొత్త రూపు తీసుకువచ్చారని కొనియాడారు. హసీనాను పదవి నుంచి దింపే కుట్రవెనక ఎవరున్నారో బయటకు రాలేదు కానీ.. మహఫుజ్ అబ్దుల్లా పాత్ర ఉండొచ్చంటూ పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఇదంతా యాదృచ్ఛికంగా జరిగింది కాదని, ఒక ప్రణాళిక ప్రకారం జరిగిందని అన్నారు. ఇదిలా ఉంటే.. హసీనాను దించే కుట్రలో విదేశీ హస్తం ఉందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అందులో అమెరికా పేరు కూడా వినిపించింది. పదవి నుంచి దిగిపోవడానికి ముందు మేలో హసీనా చేసిన ప్రకటన కూడా అందుకు కారణమైంది.బంగ్లాదేశ్‌కు చెందిన సెయింట్ మార్టిన్ దీవిలో వైమానిక స్థావరం ఏర్పాటుచేసుకోవడానికి ఒక దేశానికి అనుమతిస్తే.. తన ఎన్నిక సాఫీగా జరిగేటట్లు చేస్తానని ఆఫరిచ్చిందన్నది దాని సారాంశం. ఆ ప్రకటన ఒక్కసారిగా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.

## పీఎం కిసాన్ 18వ విడత తేదీ ఖరారు

ఈ 18వ విడతను విడుదల చేసే తేదీని ప్రభుత్వం ప్రకటించింది. దాదాపు 9 కోట్ల మంది పేద రైతులకు పిఎం కిసాన్ యోజన కింద రూ.2,000 అందజేయనున్నారు.పీఎం కిసాన్ యోజన వెబ్‌సైట్ ప్రకారం, దాని 18వ విడతను 5 అక్టోబర్ 2024న ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేస్తారు. ఈ పథకానికి పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తుంది.పథకం ప్రయోజనాలను పొందడానికి తప్పనిసరి:మీరు మీ ఖాతాలో పీఎం కిసాన్ యోజన డబ్బును స్వీకరించాలనుకుంటే, మీరు పీఎం కిసాన్ పోర్టల్‌లో చేయడం తప్పనిసరి. పీఎం కిసాన్ యొక్క లేని వారు పథకం ప్రయోజనాలను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. కిసాన్ పోర్టల్‌లో, మీరు మొబైల్ నంబర్, ఆధార్ కార్డ్ సహాయంతో ఓటీపీ సహాయంతో మీ ని పూర్తి చేయవచ్చు. మీరు దీన్ని చేయలేకపోతే, మీ సమీప కామన్ సర్వీస్ సెంటర్ ని సందర్శించడం ద్వారా మీరు పనిని పూర్తి చేయవచ్చు.ఇంతకుముందు, ప్రభుత్వం జూలైలో పిఎం-కిసాన్ యోజన యొక్క 17వ విడతను విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం 2019లో ఈ పథకాన్ని ప్రారంభించింది. అయితే, ఇది డిసెంబర్ 2018 నుండి అమలులోకి వచ్చింది.

## తప్పు చేశారు కాబట్టే డిప్యూటీ సీఎం పవన్ ప్రాయశ్చిత్త దీక్ష

తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యికి సంబంధించి.. జూన్ 12 నుంచి ఏఆర్ డెయిరీ సప్లై మొదలైందని..అప్పటికే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. అలాగేజూన్ 12 తర్వాత నెయ్యి క్వాలిటీ లేదని.. వెనక్కి పంపామని చెప్పినట్లు గుర్తు చేశారు. కూటమి నేతలు ఆరోపిస్తున్నట్లు.. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి కలిసిందనడానికి ఆధారాలు లేవని, రాష్ట్రంలో ప్రాయశ్చిత్త దీక్ష చేయాల్సింది సీఎం చంద్రబాబు నాయుడుని ప్రాయశ్చిత్త దీక్ష చేయాల్సింది చంద్రబాబు మాజీ మంత్రి అన్నారు. అలాగే లడ్డూ వ్యవహారంలో తప్పు చేశారు కాబట్టే డిప్యూటీ సీఎం పవన్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నారని మాజీ మంత్రి వేణు చెప్పుకొచ్చారు.

## తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదలం

నటి జత్వానీ ఇచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర డీజీపీ ద్వరకా తిరుమల రావు విచారణ చేపట్టారు.ఈ మేరకు కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు ఐపీఎస్ అధికారులను ఆయన సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు.తాజాగా, ఇదే అంశంపై హోంమంత్రి అనిత రియాక్ట్ అయ్యారు. ముంబయి నటి కాదంబరీ జత్వానీ కేసులో ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ చేసినట్లుగా గుర్తు చేశారు. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. కేసులో మరికొంత మంది పోలీసులను కూడా విచారిస్తున్నారని తెలిపారు. విచారణలో వారు బాధ్యులని తేలితే.. అందులో ఎంత పెద్దవారు ఉన్నా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కేసును సీఎం చంద్రబాబు కూడా చాలా సీరియస్ రివ్యూ చేస్తున్నారని అనిత గుర్తు చేశారు.ముంబయి నటి కాదంబరీ జెత్వానీ కేసులో ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ చేసినట్లు హోంమంత్రి అనిత తెలిపారు.

## ఆ ధర్మాన్నే పవన్ కళ్యాణ్ పాటిస్తాడు

రక్షించు అని సమానత్వాన్ని చాటిందే సనాతన ధర్మం. ఆ ధర్మాన్నే పవన్ కళ్యాణ్ పాటిస్తాడు. ఎన్నో మీటింగ్స్ ఉధృత స్థాయిలో జరుగుతున్నపుడు మజీద్ నుంచి అజాన్ వస్తే తన స్పీచ్‌ని అజాన్ పూర్తయే దాక ఆపేసి నిశ్శబ్దం పాటిస్తాడు పవన్ కళ్యాణ్.అది పర మతానికి అతనిచ్చే గౌరవం, మర్యాద.. పవన్ కళ్యాణ్ అనే వ్యక్తిని హిందువులు మాత్రమే కాదు, క్రైస్తవులు, ముస్లింలు కూడా ప్రేమిస్తారు.. అతను మతఛాందస్స వాది కాదు హిందూ మతాన్ని గౌరవించాలి హిందూ ఆచారాలని రక్షించాలని పాటుపడేవాడు. హిందూ మత ధర్మ పరిరక్షణలో ఆయన పోరాటం క్రైస్తవుల మీద, ముస్లింల మీద కాదు హిందూ ధర్మంలో ఉంటూ హిందూ ధర్మాన్ని చులకన చేస్తూ సెక్యులర్ వాదులం అని చెప్పుకునే సూడో సెక్యులర్ వాదులను చెంపపెట్టి కొట్టడానికి మాత్రమే. తన పాలనలో ప్రతి మతం ప్రశాంతంగానే ఉంటుంది. పవన్ కళ్యాణ్ మాటలు సూడో సెక్యులర్ వాదులకి తప్ప ఏ క్రిస్టియన్‌కి ఏ ముస్లింకి బాధ కలిగించవు.. అర్థం చేస్కోగలరు' అని నాగబాబు ట్వీట్‌లో పేర్కొన్నారు.

## జగన్ క్రిస్టియన్... తిరుమలలో డిక్లరేషన్ పై సంతకం చేయాల్సిందే

రఘురాజు అన్నారు. అన్య మతస్తులు ఎవరు తిరుమలకు వెళ్లినా రూల్స్ పాటించాల్సిందేనని చెప్పారు. హిందూమతం పట్ల, స్వామివారి పట్ల విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. తిరుమల లడ్డూను వాసన చూసి వదిలేయకుండా నిండు విశ్వాసంతో లడ్డూను తినాలని చెప్పారు. తప్పు చేసిన జగన్ ను పాప పరిహారం చేసుకోవడానికి వేంకటేశ్వరస్వామి తిరుమలకు పిలిచినందుకు సంతోషంగా ఉందని రఘురాజు అన్నారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత స్వామివారి లడ్డూని స్వచ్ఛమైన నేతితో అద్భుతంగా చేయిస్తున్నారని కొనియడారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ఎలాంటి దోషాలు జరగకుండా హిందూ మనోభావాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజు ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. క్రైస్తవుడు అయిన జగన్మోహన్ రెడ్డి మెట్లు ఎక్కి కాలినడకన తిరుపతి వెళు తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి క్రైస్తవుడు అనేది అందరికీ తెలిసిందే అని.. ఎవరైనా తిరపతి వెళ్లాలంటే రూల్స్ ఫాలో అవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. మతపరంగా అన్య మతస్థుడు తిరుపతి వెళ్లాలంటే హిందూ మతం పట్ల అమితమైన విశ్వాసం ఉందని ఒక డిక్లరేషన్ ఇచ్చి వెళ్ళాలన్నారు.పాపపరిహారార్థం జగన్మోహన్ రెడ్డి చెంపలు వేసుకుని తిరుపతి లడ్డూను వాసన చూసి వదిలేయకుండా నిండు విశ్వాసంతో తిరుపతి లడ్డూను తినాలని అన్నారు. పాప పరిహారార్థం తప్పు చేసిన జగన్మోహన్ రెడ్డిని స్వామివారు తిరుపతికి పిలిచినందుకు సంతోషిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అందరితో కలిసి స్వీకరించామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత తిరుపతి లడ్డూ స్వచ్ఛమైన నేతితో చాలా అద్భుతంగా తయారుచేశారని చెప్పారు.

# సిరిసిల్ల నేతలన్న తరపున పోరాటానికి సిద్ధం



పాఠ్య పుస్తకాల్లో చేర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఐలమ్మ తిరుగుబాటు అందరికీ గుర్తుండేలా జిల్లా కేంద్రంలో బ్రహ్మాండంగా ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎంతోమందికి స్ఫూర్తినిచ్చి కదిలించిన నాయకురాలు ఐలమ్మ స్ఫూర్తితో భవిష్యత్తులో అందరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నేలకొండ అరుణ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు అక్కరాజు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు రజక సంఘ సభ్యులు పాల్గొన్నారు.భారాస హయాంలో నేతలన్నను కాపాడుకున్నామని, ఇప్పుడు మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో ఆయన మీడియాతో మాట్లాడారు.సిరిసిల్ల నేతలన్నకు రూ.3,312 కోట్ల ఆర్డర్లు ఇచ్చామని, ఉపాధి కల్పనతో నేతన్నల ఆత్మహత్యలు తగ్గాయన్నారు. "ప్రజలకు కేసీఆర్ కిట్లు, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక అందజేశాం. నేతన్నలతో చీరలు నేయించి పంపిణీ చేశాం. సిరిసిల్లను మరో తిరుప్పూరు చేయడానికి కృషి చేశాం.కాంగ్రెస్ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు నిలిపివేశారు. బతుకమ్మ చీరల్లో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. దానిపై విచారణ చేయాలని అసెంబ్లీ సాక్షిగా చెప్పాం. సిరిసిల్ల నేతన్నల తరపున పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. మా పోరాటానికి నేతన్నలు కూడా సహకరించాలి.హైడ్రా బాధితులకు తాము అండగా ఉంటామని, ఎవరికైనా ఏమైనా సమస్య వస్తే హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ ఆఫీస్... తెలంగాణ భవన్‌కు రావాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... హైడ్రా బాధితులందరికీ తప్పకుండా తమ పార్టీ, తమ పార్టీ న్యాయవిభాగం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.తమ పార్టీ కార్యాలయం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 10, రోడ్డు నెంబర్ 12 మధ్యలో ఉంటుందని, బాధితులు అక్కడికి రావొచ్చని సూచించారు. అక్కడ తమ న్యాయవిభాగం సహకారం అందిస్తుందన్నారు. తమకు ఓటు వేసి గెలిపించినందుకు హైదరాబాద్ ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.అక్కడకు రాలేని పరిస్థితుల్లో హైదరాబాద్‌లో దాదాపు అందరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ కార్పొరేటర్లే ఉన్నారని, వారి వద్దకు వెళ్లవచ్చన్నారు. న్యాయపరంగా అండగా ఉంటామన్నారు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించాలని న్యాయస్థానం ద్వారానే ప్రభుత్వానికి చెప్పిస్తామని తెలిపారు. పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తున్నారని ఆరోపించారు. సామాన్యుల పట్ల అమానవీయంగా ప్రవర్తించడం దారుణం అన్నారు. ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న దుకాణాలు నడుపుకునే వారు చాలా చిన్న చిన్న వాళ్లేనని అన్నారు. ఆక్రమణల తొలగింపు మంచిదే కానీ... ప్రత్యేకంగా వెండింగ్ జోన్‌ను ఏర్పాటు చేసి వారిని అక్కడి నుంచి పంపించాలని సూచించారు. కోటీశ్వరుల ఆక్రమణలు కూల్చివేస్తే వారికి ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చని... కానీ సామాన్యులు ఇబ్బంది పడతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ శాఖ ఏం చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. కొంతమంది నివాసాలు రిజిస్ట్రేషన్ అయిన మూడు రోజులకే కూల్చివేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? లేక సర్కస్ నడుపుతున్నారా? అని నిలదీశారు.ఈ ప్రభుత్వానికి దమ్ముంటే పర్మిషన్ ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. అందుకే అన్యాయం జరుగుతున్న వారికి అండగా ఉండాలని తాము నిర్ణయించుకున్నామన్నారు. తాము పేదల వద్దకు వెళ్లి... బుల్డోజర్లను అడ్డుకుంటామన్నారు. తాము ఆక్రమణలను ప్రోత్సహించడం లేదని, కానీ మానవీయ కోణంలో ఆలోచించాలని సూచిస్తున్నామన్నారు. అయినా, ఆక్రమణలు అన్నీ కాంగ్రెస్ వారివే ఉంటాయని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు న్యాయం చేద్దామని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. ఆక్రమణలన్నింటినీ కూలగొట్టాలని ప్రభుత్వం భావిస్తే జీహెచ్ఎంసీ కార్యాలయం నాలా మీదనే ఉందని గుర్తించాలన్నారు. మంత్రులు ఇళ్లు, ఫామ్ హౌస్‌లు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయని ఆరోపించారు.

### కుదురుపాకలో స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్నానని కేటీఆర్ ట్వీట్

పెద్దపల్లి జిల్లాలోని కుదురుపాకలో కేటీఆర్ ఈ రోజు స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. తన గ్రాండ్ పేరెంట్స్ జె.కేశవరావు, లక్ష్మీల జ్ఞాపకార్థం ఈ స్కూల్ భవంతిని నిర్మించినట్లు తెలిపారు.

# ఆ విషయం నేను ముందే చెప్పా

పాల్గొన్న ఈటల ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

### కులగణన విషయంలో..

కులగణన అనేది ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం నిర్వహించుకుంటే మంచిదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కొన్ని కులాలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కేటగిరిలో ఉన్నాయని, ఓ రాష్ట్రంలో ఓసీ అనుకున్న కులం మరో రాష్ట్రంలో బీసీగా పరిగణించబడుతున్నందునా జనగణన సంపూర్ణంగా రాష్ట్ర ప్రభుత్వాలే చేపట్టి కులాల వారీగా లెక్కలు బయటకు తీయాలన్నారు. అలా చేస్తే కోర్టులు కూడా అడ్డుచెప్పే ఆస్కారం లేదని తమిళనాడు ఉదంతాన్ని చదివిన వ్యక్తిగా చెబుతున్నాన్నారు. ప్రస్తుతం మతం, కులం, జాతీయత దాస్తే దాగేవి కావన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నదని ఇంకా కులం ఎక్కడ ఉందనే వాళ్లు ఉన్నారు. కానీ ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఈ దేశంలో ఇంకా కులం ఉందనేది వాస్తవం అన్నారు. అణగారిన జాతుల హక్కుల కోసం ఆర్.కృష్ణయ్య చేస్తున్న పోరాటాన్ని అభినందిస్తున్నాను. ఆయన పోరాటానికి మా సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

### ఎన్నికలకంటే ముందే రిజర్వేషన్లు పెంచాలి:

స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే బీసీ రిజర్వేషన్లు పెంచాలని ఈటల డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ కు మేము సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నామన్నారు. అన్నీ పార్టీలు మొదట బీసీలకు సముచిత స్థానం కల్పించి చూపించాలన్నారు. నాకు తెలిసి ఈ దేశంలో మొట్ట మొదటి సారి ఓబీసీల కేంద్ర మంత్రుల సంఖ్య ఎక్కువ ఉన్నది నరేంద్ర మోడీ కేబినెట్ లోనే అన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు ఓబీసీ ముఖ్యమంత్రి కాలేకపోయారు. ప్రజలు ఆశీర్వదిస్తే మేము ఓబీసీ వ్యక్తిని సీఎం చేస్తామని మోడీ ప్రకటన చేశారని గుర్తు చేశారు.కాంగ్రెస్



సర్కార్ పేదల కళ్లలో మట్టి కొడుతోందని, కేసీఆర్ కూడా ఇలాగే విర్రవీగి ఏమయ్యాడో చూశారని మల్కాజ్ గిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు.ఇవాళ మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం మల్లంపేట గ్రామంలో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యమానికి హాజరైన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డిని ఎన్నుకున్న పాపానికి హైదరాబాద్‌లోని పేదలకు కంటిమీద కునుకు లేకుండా పోయిందని అన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ ఇంకా ఎంతమంది పేదల కళ్ళలో మట్టి కొడుతుందని, ఎంతమంది జీవితాలను బుగ్గిపాలు చేస్తుందని మండిపడ్డారు. అలాగే దీనికి మూల్యం చెల్లించక తప్పదని, నీయబ్బ జాగీరా అని అడుగుతున్నామని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కూడా ఇలానే విర్రవీగాడని.. చివరికి ఏమయ్యాడో చూశారని, దెబ్బ కొడితే దిమ్మ తిరిగిందని అన్నారు. ఇక పేదల బ్రతుకుల్లో మట్టి కొడితే వారి ఉసురు తగలకుండా పోదని ఈటెల హెచ్చరించారు.

# ఒకే ఒక్క పరిష్కారం..హెజ్‌బొల్లా అంతం



అగ్రరాజ్యం అమెరికా తోపాటు, ఫ్రాన్స్ జోక్యం చేసుకున్నా ఫలితం కనిపించడం లేదు.అమెరికా, ఫ్రాన్స్ 21 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇజ్రాయెల్ తిరస్కరించింది. హెజ్‌బొల్లాను అంతం చేయడం ద్వారా మాత్రమే ఉత్తర సరిహద్దుల్లో చోటు చేసుకున్న ప్రతిష్టంభనకు పరిష్కారం దొరుకుతుందని స్పష్టం చేసింది. "ఉత్తరాదిలో చోటు చేసుకున్న సమస్యకు ఒకే ఒక్క పరిష్కారం ఉంది. అదే హెజ్‌బొల్లాను అంతం చేయడం" అని ఇజ్రాయెల్ రెవెన్యూశాఖ మంత్రి స్మోట్రిచ్ వెల్లడించారు. అమెరికా, ఫ్రాన్స్ చెప్పినట్లుగా కాల్పుల విరమణ ఒప్పందం చేసుకుంటే హెజ్‌బొల్లా కోలుకునేందుకు సమయం ఇచ్చినట్లవుతుందని వ్యాఖ్యానించారు.మరోవైపు బుధవారం రాత్రి బెకా వ్యాలీ, దక్షిణ లెబనాన్‌లోని సుమారు 75 హెజ్‌బొల్లా స్థావరాలపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఫైర్ లాంచర్లు, ఆయుధ భాండాగారాలను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. అంతకుముందు ఇజ్రాయెల్-లెబనాన్ సరిహద్దులో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై లెబనాన్ ప్రధాని నజీబ్ స్పందించారు. కాల్పుల విరమణ ఒప్పందం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### అమెరికా, ఫ్రాన్స్ ప్రయత్నాలు విఫలం

ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య సంధి కుదిర్చేందుకు అమెరికా, ఫ్రాన్స్ తీవ్రంగా ప్రయత్నించాయి. 21 రోజుల పాటు కాల్పుల విరమణకు ఇరు వర్గాలు అంగీకరించాలని తీర్మానించాయి. దీనికి యూరోపియన్ యూనియన్‌తోపాటు పలు అరబ్ దేశాలు మద్దతు పలికాయి. వెంటనే దీనిని అమలు చేసేలా ఇరు వర్గాలు కార్యాచరణ ప్రారంభించాలని కోరాయి. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, ఫ్రాన్స్ ప్రధాని ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కాల్పుల విరమణకు రావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు"గత ఏడాది అక్టోబరు 7న మొదలై, ముఖ్యంగా రెండు వారాల క్రితం నుంచి జరుగుతున్న కాల్పుల వల్ల సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక పౌరులకు ఇవి శరాఘాతంగా మారుతున్నాయి. కాల్పుల విరమణకు అంగీకరించి సాధారణ పౌరులంతా వాళ్ల స్వస్థలాలకు వెళ్లేందుకు వీలు కల్పించాలి" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వైమానిక దాడులతోపాటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై భూతల దాడులు చేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధంగా ఉందని ఆ దేశ మిలటరీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ హెర్జీ హలేవి ప్రకటించిన నేపథ్యంలో అగ్రదేశాలు ఈ ప్రకటన చేశాయి.

### యుద్ధాన్ని ఆపొద్దు: నెతన్యాహు

అమెరికా, ఫ్రాన్స్ సంధి ప్రతిపాదనలపై నెతన్యాహు స్పందించలేదని అజ్రాయెల్ ప్రధాని కార్యాలయం స్పష్టం చేసింది. పూర్తి స్థాయి దళాలతో హెజ్‌బొల్లాతో పోరాటం చేయాలని నెతన్యాహు ఆదేశించినట్లు పేర్కొంది.

సాక్షి చదివినా,చూసినా ఆరోగ్యానికి హానికరం

సాక్షి చదివినా, చూసినా ఆరోగ్యానికి హానికరం. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ చేయబోమని కేంద్రమంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టంగా చెప్పారు. ప్రైవేటీకరణ లేదని నేను, మా ఎమ్మెల్యేలందరం నిన్న స్పష్టంచేశాం. విశాఖ ఉక్కును బతికించడం కోసం నిధులు మంజూరు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారు. వైసీపీ నాయకులు ఎందుకు కంగారు పడుతున్నారో అర్థం కావడం లేదు. ఇటీవల వరదలు సంభవించిన సమయంలో కష్టకాలంలో ఉన్న ప్రజలకు మేం అండగా నిలబడ్డాం. జగన్ ప్రజాధనంతో 2 బుల్లెట్ ప్రూఫ్ కార్లు కొనుక్కున్నారు కానీ ఏ నాడు జనం ముందుకు వెళ్లలేదు. ఎవరు అసలైన ప్రజానాయకులో రాష్ట్రప్రజలకు అర్థమైంది.

రెడ్ బుక్ పని ఇప్పటికే ప్రారంభమైంది

ఎవరైతే చట్టాన్ని ఉల్లంఘించారో వారికి శిక్ష తప్పదని నేను చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నా. ఆ ప్రకారం ఇప్పటికే రెడ్ బుక్ అమలు ప్రారంభమైంది. చట్టాన్ని అతిక్రమించి తప్పు చేసిన వారిని వదిలేది లేదు. ఇందులో భాగంగా ఐపీఎస్ లు కూడా సస్పెండ్ అయ్యారు. రైట్ ప్లేస్ లో రైట్ పర్సన్ ఉండాలన్నదే మా ప్రభుత్వ అభిమతం.విశాఖలో పర్యటిస్తున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రెండో రోజు ఉదయం టీడీపీ పార్టీ జిల్లా కార్యాలయంలో "ప్రజాదర్బార్" నిర్వహించారు.మంత్రి లోకేష్‌ను స్వయంగా కలిసి ప్రజలు తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఒక్కరి

## డిక్లరేషన్ సాంప్రదాయాన్ని జగన్ పాటిస్తే బాగుంటుంది!

విజ్ఞప్తిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ నర్స్ స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ విధానంలో డీఎంఈ, ఏపీవీవీపీ, డీపీహెచ్, ఎన్‌హెచ్ఎం విభాగాలలో పనిచేస్తున్న నర్సులను రెగ్యూలర్ చేయాలని, వంద శాతం గ్రాస్ జీతం అమలు చేయాలని, పరస్పర అంగీకార బదిలీలు అమలు చేయాలని, బీమా అందించాలని కోరారు. జర్నలిస్టులకు 4 సెంట్లు చొప్పున ఉచితంగా ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు రూ.10వేల పెన్షన్ సదుపాయం, కరోనాతో మృతి చెందిన వారికి పరిహారం తదితర సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.అనకాపల్లి మండలం కోడూరులో ఎక్స్ సర్వీస్ మెన్ కోటాలో తమ తండ్రికి కేటాయించిన 5.22 ఎకరాల భూమిని వైసీపీ అండతో ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని ఎస్. నాగమణి, జి. జయలక్ష్మి కోరారు. డీఎస్సీ 2008 నోటిఫికేషన్‌లో ఎంపికై నష్టపోయిన అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని ఏపీ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రష్యాలో వైద్య విద్య అభ్యసిస్తున్న తమ పిల్లలకు ఎన్టీఆర్ విదేశీ విద్య దీవెన బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటిందనే నెపంతో గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు కోరారు.ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, గత వైసీపీ ప్రభుత్వంలో దళితుల హత్యలు, దాడుల పై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ సుధాకర్ అంశం, వైకాపా ఎమ్మెల్సీ అనంత బాబు చేతిలో హత్యకు గురైన డ్రైవర్ సుబ్రహ్మణ్యం, కోడికత్తి శ్రీను, కిరణ్ కుమార్ హత్య వంటి కేసులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. భర్త చనిపోయిన తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయడంతో పాటు జీవనోపాధి కల్పించాలని విశాఖకు చెందిన గంటిపిల్లి నూకరత్నం విజ్ఞప్తి చేశారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యాలయానికి పెద్ద ఎత్తున చేరుకున్న నేతలు, కార్యకర్తలను కలిశారు. వారితో కలిసి ఫొటోలు దిగారు.రూ.250 కోట్లు ఉండాలన్న నిబంధనను వైవి సుబ్బారెడ్డి రూ.150 కోట్లకు తగ్గిస్తూ ఎందుకు సవరించారు? తిరుమలలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు కమిటీ వేశాం. ఆ కమిటీ విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయి. ఇప్పుడు తిరుమల లడ్డూ క్వాలిటీ బాగుందని వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా చెబుతున్నారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విధ్వంసమే



అస్థిరత రాజ్యమేలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు అధికారం అప్పగించవద్దని ప్రజలకు సూచించారు. బుధవారం హరియాణాలోని సోనిపట్ జిల్లా గొహానాలో ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అస్థిరత, అవినీతి, బంధుప్రీతి తదితర అవలక్షణాలన్నీ ఉంటాయని ఆరోపించారు. కర్ణాటకలో ఇప్పుడు అలాంటి పరిస్థితే ఉందని గుర్తుచేశారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మధ్య అంతర్గత యుద్ధం సాగుతోందన్నారు. తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లోనూ అదే కథ అని పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ పట్ల హరియాణా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

### కాంగ్రెస్ పాలనలో బడుగులకు అన్యాయం

రిజర్వేషన్లను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని ప్రధానమంత్రి మండిపడ్డారు రిజర్వేషన్ల పట్ల ద్వేషం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉందని విమర్శించారు. అందుకే కాంగ్రెస్ రాజ కుటుంబంలోని నాలుగో తరం రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తోందని ఆరోపించారు. ఆ పార్టీ అధికారంలో లేనప్పుడే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు హక్కులు లభించాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఆయా వర్గాల హక్కులను లాక్కుందని, తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు.

### పారిశ్రామికీకరణతో పేదలు, రైతులు, దళితులకు లబ్ధి

ఇటీవల జరిగిన అమెరికా పర్యటన గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. అమెరికాలో పలువురు ముఖ్య నాయకులను, ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులను కలిశానని చెప్పారు. భారతీయ యువత నైపుణ్యాల గురించి వారికి వివరించానని అన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద కంపెనీలు నేడు భారత్‌లో ఫ్యాక్టరీలు ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు. దేశంలో పారిశ్రామికీకరణ పెరిగితే పేదలు, రైతులు, దళితులు అధికంగా లబ్ధి పొందుతారని స్పష్టంచేశారు. పరిశ్రమలు, వ్యవసాయ రంగాల్లో బీజేపీ ప్రభుత్వం హరియాణాను అగ్రశ్రేణి రాష్ట్రంగా తీర్చిదిద్దిందని ఉద్ఘాటించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ బీజేపీకి ఆదరణ నానాటికీ పెరుగుతోందని, కాంగ్రెస్ దిగజారిపోతోందని వివరించారు. రాష్ట్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని మోదీ ధీమా వ్యక్తంచేశారు.

# ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను గౌరవించని కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

## ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సతీష్



రామగుండం: (శుభోదయం న్యూస్) : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను ప్రోటోకాల్ ప్రకారం గౌరవించని మెదక్ జిల్లా కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సతీష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మెదక్ కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన ల్యాండ్, అట్రాసిటీ కేసుల సమీక్ష సమావేశానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారని, ఇటీవల జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశానికి మంత్రి కొండ సురేఖతో కలిసి పాల్గొన్నారని, అధికారులు కనీసం బొకే కూడా ఇచ్చి ఆహ్వానించక పోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. అగౌరవ పరచడంతో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సమావేశంలో మధ్యలోనే వెళ్లిపోయారని, అంతేగాకుండా సమావేశానికి హాజరవుతున్నట్లు ముందస్తుగా సమాచారం ఇచ్చినప్పటికీ కూడా అధికారులు తగిన ప్రొటోకాల్ పాటించకపోవడంపై మండిపడ్డారు. చట్టాలను గౌరవించాల్సిన అధికారులే ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పట్ల ఈ విధంగా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పరిస్థితే ఈ విధంగా ఉంటే ఇక సామాన్య ఎస్సీ, ఎస్టీ ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, మంత్రులకు, ప్రభుత్వ కార్యదర్శికి ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేయడం జరుగుతుందని పత్రికా ముఖంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సతీష్ తెలిపారు.

# చెరువులను, నాలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవు

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి సుతారి లక్ష్మణ్ బాబు, ప్రధాన కార్యదర్శి మంతెన వెంకటేష్



రామగుండం, (శుభోదయం న్యూస్) : భవిష్యత్ లో డబ్బు అధికారం పలుకు బడి తో ఎవరైనా ఎంతటి వారైనా చెరువులను కుంటలను నాళాలల ను చట్ట విరుద్ధంగా అక్రమంగా అక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది అని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా సంస్థ తీసుకుంటున్న చర్యలు భూ కబ్జా దారులకు చెరువుల ఆక్రమణ దారులకు ఒక హెచ్చరిక అని ఇట్టి చర్యలను ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి సుతారీ లక్ష్మన్ బాబు జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్య దర్శి మంతెన వెంకటేష్ లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు హైదరాబాద్ మహానగరం కీర్తి ప్రతిష్టలు చెరిగి పోకుండా విశ్వ నగరంగా అభివృద్ధి చెందాలి హైదరాబాద్ నగరం సురక్షితంగా ఉండాలి ఇక్కడ నివసించే ప్రజలు వరదల వల్ల ముంపుకు గురి కావద్దు ప్రజలు సురక్షితముగా ఉండాలి అని హైదరాబాద్ నగరంలో చెరువులు కుంటలు ఆక్రమించు కొని ఇండ్లు ఫంక్షన్ హాల్స్ ఇతరత్రా కట్టడాలు అక్రమంగా కట్టుకున్న. వారిని గుర్తించి హైడ్రా సంస్థ తగువిచారణ చేపట్టాలి అనుమతి లేని కట్టడాలు అక్రమ కట్టడాలు వీటి పై తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ ముందు తరాల వారి భవిష్యత్ భద్రంగా ఉండాలి అని హైడ్రా సంస్థ ఏర్పాటు చేశారు హైడ్రా సంస్థ ఇందులో పని చేస్తున్న అధికారులు నిజాయితీగా సమర్ధ వంతంగా పని చేస్తున్నారు నిక్షిప్తపాతముగా తమ కర్తవ్యాన్ని కొనసాగిస్తున్నారు ఆక్రమణకు గురి అయిన కట్టడాలను గుర్తించి తగు విచారణ చేపట్టి చెరువులలో కుంటలలో అక్రమ కట్టడాలు కట్టిన వాటిపై తగు చర్యలు చేపడుతూ వాటిని కూల్చి వేస్తూ తీసుకున్న నిర్ణయం హైడ్రా తీసుకుంటున్న చర్యలు కూలుస్తున్న అక్రమ కట్టడాలు ఇట్టి చర్యలను హైదరాబాద్ నగర ప్రజలే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు అని ఈ నేపథ్యం లో హైడ్రా సంస్థ ను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేయాలి అని ప్రజా సంపద అయిన చెరువులు కుంటలు నాలలను రక్షించాలి రక్షించబడాలి అని చట్ట ప్రకారం న్యాయ బద్దం గా ఇండ్లు కట్టుకుని నివసిస్తున్న ప్రజలు సురక్షితముగా ఉండాలి ప్రభుత్వ ఆస్తులు రక్షించ బడాలి అని. భవిష్యత్ తరాల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది ఈ నిర్ణయాన్ని హర్షించాల్సినది పోయి ఆక్రమణ దారులకు వత్తాసు పలుకుతూ వారిని రెచ్చ కొడుతున్న బి ఆర్ ఎస్ నాయకుల చర్యలను ప్రజలు అసహ్యించు కుంటున్నారు డబ్బు అధికారం పలుకు బడి చూడకుండా ఎవరైనా సరే వారు ఎంతటి వారైనా అక్రమ కట్టడాలు కడితే కూల్చి వేస్తామని హైడ్రా సంస్థ తీసుకుంటున్న చర్యలు ముందు తరాలకు భద్రత ఇస్తుంది అని రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా సంస్థ ను విస్తరించాలని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కోరుకుంటున్నారు. పేద వారికి నష్టం కలిగించే పని చేయడం లేదని పేదలు కట్టుకున్న ఇండ్లను కూల్చి వేయడం లేదని కొంత మంది కావాలని దుష్ప్రచారం చేస్తున్నారు అని అలాంటి అసత్య ప్రచారం నమ్మవద్దని హైడ్రా అధికారులు స్పష్టముగా చెపుతున్నారు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పక్షాలు సద్విమర్శ లు చేయాలి కానీ దురుద్దేశం తో ప్రభుత్వం చేసే మంచి పనులను కూడా విమర్శించడం కొందరు ప్రతి పక్ష నాయకులకు సరి అయిన విధానం కాదు అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి సుతారీ లక్ష్మన్ బాబు జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్య దర్శి మంతెన వెంకటేష్ లు అన్నారు.

# గీతాంజలి హై స్కూల్ 2007 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




గోదావరిఖని (శుభోదయం న్యూస్) : గోదావరిఖని సిరి ఫంక్షన్ హాల్లో గాంధీనగర్ లో ఉన్న గీతాంజలి హై స్కూల్ 2007 బ్యాచ్ విద్యార్థులు గెట్ టుగెదర్ సెలబ్రేషన్ ఘనంగా నిర్వహించడం జరిగింది దీనికి ముఖ్యఅతిథిగా కంది రవీందర్ రెడ్డి శ్రీనివాస్ రమేష్ తిరుపతిరెడ్డి రోజు మేరీ మేడం ఉపాధ్యాయ ఉపాధ్యాయులు ముఖ్య అతిథులుగా విచ్చేసి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది చిన్నప్పటి చిరు జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఎంతో మధురానుభూతులను అనుభూతి చెందుతూ ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అందరూ ప్రధానోపాధ్యాయులకు, మరి ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది పాల్గొనడం జరిగింది.

# డెమొక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులుగా మామిడి స్వామి



గోదావరిఖని టౌన్: సెప్టెంబర్29, (శుభోదయం న్యూస్) : డీజే ఎఫ్ జిల్లా అధ్యక్షులు కల్లేపల్లి కుమార్ జాతీయ కార్యదర్శి సబితం లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ. డి జే ఎఫ్ యూనియన్ ను పెద్ద పల్లి రామగుండం జిల్లాలో బలోపేతం చేయాలని మామిడి స్వామి గారిని నియమించడం జరిగిందని తెలియజేసినారు. మామిడి స్వామి జర్నలిస్టుగా ఈ ప్రాంతంలో సుపరిచితుడుగా ఉంటూ ఎన్నో పాత్రికేయ రంగాల్లో సేవలు చేస్తూ ఉన్నందున వారిని నియమించినందుకు వారు రాష్ట్ర అధ్యక్షులు జిల్లా అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియజేసినారు. డీ జే ఎఫ్ జిల్లా కార్యదర్శి మరియు సామాజిక తెలంగాణ పెద్దపల్లి జిల్లా స్టాఫ్ పోర్టర్ కనుకుంట్ల రమేష్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసినారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పాపన్నపేట, (శుభోదయం న్యూస్ ): పాపన్నపేట మండలం కుర్తివాడకు చెందినకాదూరి విఠల్ శిరీష కు రూ.45,000,పుట్నాల శ్రీనివాస్ రూ.16,000,నసీమా బేగం రూ.14,000 లకు కుర్తివాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం వారి గ్రామంలో అందజేశారు.ఇందులో భాగంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏగొండ,ఉపాధ్యక్షుడు నరేష్,నాయకులు నాగరాజు,శ్రీధర్,రాజేందర్,సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

# ఆర్థికసాయం..అందజేత



పాపన్నపేట, (శుభోదయం న్యూస్) : కుర్తివాడ గ్రామానికి చెందిన భారాస కార్యకర్త మధునాలా నాగరాజు ఆదివారం ఉదయం మరణించారు.ఈవిషయం తెలుసుకున్న భారాస మెదక్ జిల్లా పార్టీ ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.స్పందించి కార్యకర్తలచే రూ.5,000 ఆర్థిక సహాయం ఆదివారం వారి కుటుంబానికి అందించడం జరిగింది.ఇందులో భాగంగా భారాస మండల యూత్ ప్రెసిడెంట్ కొత్తూరి శ్రీనివాస్,మాజీ ఉప సర్పంచ్ పోతాగౌడ్,వడ్ల మధుసుదన్ చారీ,సిద్దిరాంరెడ్డి,బాల్ రెడ్డి,మన్నేవెంకటేశం,గంగారాం,సంతోష్,శ్రీనివాస్,ప్రభు కుమార్,గోపాల్ తదితరులు ఉన్నారు.

# బాల విజ్ఞాన్ మందిర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




రామగుండం (శుభోదయం న్యూస్) : గోదావరిఖని కళ్యాణ్ నగర్ లోని బాలవిజ్ఞాన్ మందిర్, విద్యార్థులు 1997- 98 సంవత్సరం విద్యార్థుల ఆత్మీయ కలయిక 26 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ప్రేమ అనురాగాలకు అవధులు లేవుకుండా పోయింది ఒక్కరిని ఒకరు పలకరించుకుంటూ చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ ఎంతో ఆనందంగా ఈరోజు ఆనాటి గురువులతో విద్యార్థిని విద్యార్థులు గురువులు ఆ రోజుల్లో చెప్పిన మాటలు తూచా తప్పకుండా పాటించుకుంటూ ఎందరో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు ఎదిగించిన ఉపాధ్యాయులను ఈరోజు కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు తదనంతరం గురువులను సన్మానించడం జరిగింది. ఉపాధ్యాయులు గడ్డం పద్మావతి, దుర్గ, అరుణ, గుండబోయిన శ్రీనివాస్, అడ్డూరి రాజు, పూదరి వెంకటేష్, మరియు విద్యార్థిని విద్యార్థులు ఉమామహేశ్వరి, రమేష్, గడ్డం శ్యామ్ కుమార్, వడ్నాల శ్రీనివాస్ రవి తదితర పాల్గొన్నారు.

# టంగుటూరు ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎంపిక!




టంగుటూరు, (శుభోదయం న్యూస్ ) : టంగుటూరు ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ట్రంక్ రోడ్ లోని అభి స్టూడియో ఆవరణంలో ఆదివారం నూతన కమిటీ ఎంపిక మరియు ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులుగా చుండి రమేష్ బాబు, నూతలపాటి వెంకట సాయి కిరణ్, ఉపాధ్యక్షులుగా పారాబత్తిన శ్రీ హరి బాబు, కోశాధికారిగా కసుకుర్తి అనిల్ కుమార్, జాయింట్ సెక్రటరీగా లంకతోటి కోటేశ్వరరావులను, కార్యవర్గ సభ్యులుగా చింతగుంట నాగరాజు, పాడిబండ్ల సుబ్బారావు మరియు ఏడుగురు సాధారణ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# కనిగిరి ఆర్డీవో బదిలీ



కనిగిరి ఆర్సి ఇంచార్జ్, (శుభోదయం న్యూస్):కనిగిరి డివిజన్ ఆర్డీఓ గా విశిష్ట సేవలందించి మంచికి మారుపేరుగా నిలిచి బదిలీపై కడప జిల్లాకు వెళ్తున్న పాలపర్తి జాన్ ఇర్విన్ గారిని కనిగిరి దుర్గం బాప్టిస్టు చర్చి కమిటీ వారి ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం జరిగింది.ప్రభువు దినం సందర్భంగా ఆర్డీఓ జాన్ ఇర్విన్ యువతకి మంచి సందేశం ఇచ్చారు నమ్ముకొని కష్టపడి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఇన్స్పిరేషన్,స్పిర్చువల్ గా ఎదగాలనియువతకి పలుఅంశాలు తెలిపారు. అనంతరం ఆర్డీఓ జాన్ ఇర్విన్ గారిని కమిటి వారు సన్మానించారు ఈ కార్యక్రమంలో చైర్మన్ జి.విద్యాసాగర్ సెక్రటరీ టి. సర్వోన్నత కుమార్, సంఘకాపరి డా:వి. ప్రభు మనోహర్ దాస్,వై.రూప్ కుమార్,జి. అశోక్ బాబు, జి. సదానందం,టి. రాజేంద్ర,వై.వెస్లీ స్టాండింగ్ కమిటీ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పనిచేసే యంపి, ఎంఎల్ఏ లు దొరకటం మన అదృష్టం : రాష్ట్ర కాపు నేత పులి శ్రీరాములు



స్టేట్ బ్యూరో, (శుభోదయం న్యూస్): పనిచేసే యంపి పుట్టా మహేష్ కుమార్, పనిచేసే ఎంఎల్ఏ బడేటి చంటి లు ప్రజాప్రతినిధులుగా రావటం ఏలూరు ప్రజల అదష్టం అని రాష్ట్ర కాపుసంక్షేమ సేవాసంఘం అధ్యక్షులు పులి శ్రీరాములు అన్నారు కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన విజయోత్సవం ఏలూరు రాయల్ స్టార్ ఫంక్షన్ హాలులో పులి శ్రీరాములు అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్ఏ బడేటి చంటి మాట్లాడుతూ తమ తాత తండ్రి చేసిన అభివృద్ధిని రానున్న 5 సంవత్సరాల్లో పూర్తిచేస్తామన్నారు. 15 కోట్ల తో శనివారప్పేట కాజ్ వే స్థానంలో నూతన వంతెన నిర్మిస్తామన్నారు.ఇటీవల జరిగిన వరదల వల్ల నష్టపోయిన వారికి ఏలూరు వాసులు ఒక కోటి రూపాయల విరాళం అందచేశారన్నారు.త్వరలోనే రోడ్ల నిర్మాణం,రిపేర్లు చేయిస్తామన్నారు. కాపుసంక్షేమ సేవాసంఘం తరపున జిల్లా అధ్యక్షులు పూజారి నిరంజన్ 50 వేల రూపాయల చెక్కును అన్నా క్యాంటీన్ల కోసం ఎంఎల్ఏ బడేటి చంటి కి అందచేశారు.పేటేటి రామకృష్ణ ప్రసాద్ 10 వేల చెక్కు ను అందచేశారు. యంపి పుట్టా మహేష్ కుమార్ పంపిన సందేశాన్ని పులి శ్రీరాములు సభ్యులకు తెలిపారు. యంపి పుట్టా మహేష్ కుమార్ 100 రోజుల్లో సాధించిన ప్రగతి ని పులి శ్రీరాములు తెలుపుతూ,వర్జీనియా పొగాకు రైతులకు 110 కోట్ల లబ్ది,పోలవరానికి 12,500 కోట్లు, ఏలూరు కు వందే భారత్ ఎక్స్ ప్రెస్ హాల్టు, జాబ్ మేళా తో 566 మందికి ఉద్యోగాలు,పామాయిల్ రైతుల కు గిట్టుబాటు ధర సాధించారన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యునిగా నియమితులైన కానాల రామకృష్ణ, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం డిప్యూటీ మేయర్ గా ఎంపికైన కర్రి శ్రీనివాసరావు లను సత్కరించారు.సాధారణంగా ప్రభుత్వ విజయాలను,వేడుకలను ఆయా రాజకీయ పార్టీలు నిర్వహిస్తాయి, కాగా సామాజిక వర్గం గా కాపుసంక్షేమ సేవాసంఘం నిర్వహించటం విశేషం. ఈ కార్యక్రమంలో నాయకులు మోటేపల్లి చంద్రశేఖర్,వాసా రాజు,గాదం వెంకట రామకృష్ణ, సామర్ల వెంకటేశ్వర రావు,కురెళ్ళ భాస్కర రావు,బడే సతీష్ నాయుడు,నిమ్మల జ్యోతికుమార్,సాయి ,పాటే రాంబాబు,లింగిశెట్టి శశికుమార్,నడపన దాన భాస్కర్,వీరంరెడ్డి రమేష్ రావూరి మోహన్ దుర్గా నాయుడు,మరియు యంపి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు-పులి శ్రీరాములు.

# రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ఉట్టి నాగశయనం



స్టేట్ బ్యూరో (శుభోదయం న్యూస్) : విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘ నూతన అధ్యక్షుడుగా రాయలసీమ ప్రాంతానికి చెందిన ఉట్టి నాగశయనం ఎంపిక కాబడ్డారు. ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘానికి అధ్యక్షుడుగా ఉన్న నాగశయనం రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గా కొనసాగితున్నారు. దేవాంగ కుల సంక్షేమనికి రెండు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షులు దేవాంగ కర్ణ నాగరాజు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో రాష్ట్ర అధ్యక్ష పదవికి ఖాళీ ఏర్పడడంతో రాష్ట్ర సంఘం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నాగశయనాన్ని అధ్యక్షులుగా ఎన్నుకున్నారని, వారీ పదవులో అక్టోబర్ 2025 వరకు కొనసాగుతారని అసోసియేట్ అధ్యక్షులు తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. స్థానిక గుణదల శ్రీ చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం సమావేశ మందిరంలో జరిగిన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిలులో దేవాంగ కుల అభివృద్ధి కోసం పలు తీర్మానలు చేసారు. సందర్బంగా నూతన అధ్యక్షుడు నాగశయనం మాట్లాడుతూ దేవాంగ కుల అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్ష ప్రధాన కార్యదర్సులు సజ్జ హేమలత, ఉప్పుగంటి రాజశ్రీ, కాలేపు సత్యనారాయణ, గుత్తి త్యాగరాజు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# పొదుపు సంఘాలకు ప్రోత్సాహం ప్రభుత్వ ధ్యేయం



విజయవాడ (శుభోదయం న్యూస్) : సెంట్రల్ రిపోర్టర్ : గాంధీనగర్ అనుగ్రహ దేవాలయం వద్ద విజయవాడ నగర పాలక సంస్థ - మెప్మామహిళా పొదుపు సంఘాల మహిళలచే తయారు చేయబడిన ఉత్పత్తుల ప్రదర్శన అమ్మకం కార్యక్రమం నిర్వహించడం అయినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరావు, పాల్గొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఏర్పాటు మరియు బలోపేతం ద్వార భారతదేశంలోని గ్రామీణ మహిళల ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి ప్రభుత్వం ప్రారంభించిన ఒక ముఖ్యమైన కార్యక్రమం అని. పొదుపు సంఘాల మహిళలు చిన్న చిన్న సమూహాలుగా ఏర్పడి పొదుపు చేసి, ఒకరికొకరు రుణాలు ఇచ్చుకుని, తమ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవడానికి అవకాశం లభిస్తుంది అని. మహిళల ఆర్థిక సాధికారత మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడం,పేదరిక నిర్మూలన, పేదరికంను తగ్గించడం సామాజిక అభివృద్ధి సామాజిక అభివృద్ధిని ప్రోత్సహించడం,స్త్రీల సాధికారత మహిళలలో ఆత్మస్థైర్యం పెంపొందించడం కొంతమంది మహిళలకు ఈ కార్యక్రమం గురించి సరిపడా అవగాహన ఉండదు అని,నైపుణ్యాల కొరత కొన్ని సమూహాల సభ్యులకు అవసరమైన నైపుణ్యాలు ఉండవు అని. మెప్మా కార్యక్రమం భారతదేశంలోని మహిళల జీవితాలను మార్చడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది అని, ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది మహిళలు ఆర్థికంగా స్వతంత్రులు అయ్యారు అని.ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం ఇప్పటికే మహిళల కు పెద్ద పీట వేస్తూ ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తూనే ఉందని,ఈరోజు ఇక్కడ మహిళలు పచ్చడులు కారప్పొడులు, వడియాలు,తినుబండారాలు,టీ షర్ట్స్,వంటివి ఇక్కడ అందుబాటు ధరల్లో స్వయంగా మహిళలే ఉంచడం చాలా సంతోషం గా ఉంది అని బొండా ఉమ, తెలియజేశారు. డివిజన్ అధ్యక్షులు చలమల శెట్టి శ్రీనివాస్,ఇమ్మిడి రాము,బాబీ,ఆర్ముఖం,నాగులపల్లి భాస్కర్,జనసేన ప్రభుజి,కొనికినేని శ్రీనివాసరావు,భాస్కర్,బోను సుందరయ్య,నాబాని దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవ ప్రతి ఒక్కరి బాధ్యత

## జాతీయ సేవా పురస్కారాల వేడుకలు.......



ఒంగోలు, (శుభోదయం న్యూస్): వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి జిఎస్సార్ చారిటబుల్ వెల్ఫేర్ ట్రస్ట్ మరియు ఎల్ సి ఈ ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పురస్కారాలు వేడుకలు ఒంగోలు సీతారాంపురం శ్రీ లాస్య ప్రియ పబ్లిక్ స్కూల్ నందు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో సామాజిక సేవా రంగంలో గ్రేస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శాలెం రాజు హోప్ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో ఎల్లప్పుడూ



తాము ఉంటామని గ్రేస్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. డాక్టర్ గడ్డం కృష్ణయ్య అబ్దుల్ కలాం సేవ పురస్కారంతోపాటు నేషనల్ కౌన్సిల్ ఢిల్లీ వారి ప్రతిష్టాత్మకమైన జాతీయ సేవ పురస్కారం అందుకున్నారు. డాక్టర్ మద్దాలి మాధవరావు ఫరెవర్ స్టార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ తో పాటు డాక్టర్ మధుర శ్రీ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్ అందుకున్నారు.ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్సామాజిక సేవా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపుని తెచ్చుకుని రాష్ట్రంలో వివిధ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న జి ఎస్ ఆర్ చారిటబుల్ వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జడ సురేష్ బాబు గౌరవ డాక్టరేట్ అందుకున్నారు రికార్డ్ డాక్టరేట్ ను ఆయన ఒంగోలులో అందుకోవటం జరిగింది సామాజిక సేవ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకోవటమే కాకుండా మానవ హక్కుల కు ప్రతిబంధం ఏర్పడినప్పుడు వారికి సత్వర న్యాయం కోసం పోరాడే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. హోప్ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ వారు జడ సురేష్ బాబుకు గౌరవ డాక్టరేట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సామాజిక వేత్త మారెళ్ళ సుబ్బారావు న్యాయవాది శ్రీనివాస ప్రసాద్ . బంగారు మెడల్ అవార్డు గ్రహీత చంద్ర. జుటూరి కృష్ణమూర్తి. గ్రేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సాలెం రాజు. తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జడ సురేష్ బాబు సేవలను కొనియాడారు. మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ సేవ చేయాలన్న సంకల్పం ఉంటే సరిపోదని అందుకు కఠినమైన దీక్ష అవసరమన్నారు సమాజంలో ఎంతోమంది ట్రస్టులు పేరుతో సేవలు అందిస్తున్నారని వారందరినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చి పురస్కారాలు ఇస్తున్న ఘనత బుచ్చి స్వర రావ్ కు దక్కిందని అన్నారు సామాజిక రంగంలో జడ సురేష్ బాబు చేస్తున్న సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు న్యాయవాదిగా సమాజాభివృద్ధిలో పాల్గొంటూ గౌరవ డాక్టరేట్ అందుకోవటం అభినందనీయమన్నారు ప్రతి ఒక్కరూ జడ సురేష్ బాబు లాంటి వ్యక్తిని స్ఫూర్తిగా తీసుకోవాలని కొనియాడారు. ఈ సందర్భంగా జడ సురేష్ బాబు మాట్లాడుతూ ఈరోజు గౌరవ డాక్టరేట్ అనేది తన జీవితంలో మరిచిపోలేని గొప్ప అనుభూతి నిచ్చిందని అన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా శ్రీ లాస్య ప్రియా పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం



రెంటచింతల(శుభోదయం న్యూస్): మండల కేంద్రమైన రెంటచింతల లోని వై ఆర్ ఎస్ ఉన్నత పాఠశాల 1970-71 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం హైదరాబాదులోని ఎల్బీనగర్ లో ఘనంగా జరిగింది. నాటి పదో తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక సందర్భంగా పాఠశాలలో వారి పాత జ్ఞాపకాలను, మధుర స్మృతులను గుర్తుకు చేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని వారి వారి యోగక్షేమాలను, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యను అభ్యసించిన మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. పాఠశాల స్థాయి విద్యను అభ్యసించిన రోజులు ఎంతో విలువైన రోజులని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ మనోభావాలను వ్యక్తపరిచారు. తమ సహ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి సతమతమవుతుంటే వారికి అందరూ కలిసికట్టుగా ఆర్థిక సాయం అందిస్తామని, అలాగే పాఠశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పడుతామని తెలిపారు. ఈ సందర్భంగా నాటి గురువులు ప్రసాద్, ఆంజనేయ రెడ్డి, సైదారెడ్డి, కేశవ శాస్త్రి తదితరులను పూర్వ విద్యార్థులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. దాదాపు 53 సంవత్సరాల తర్వాత తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించటం ఆనందంగా ఉందని పేర్కొంటూ మృతి చెందిన నాటి గురువులను స్మరించుకున్నారు. ఆనాటి పూర్వ విద్యార్థులు తమతమ చదువు స్థాయిని బట్టి ఉద్యోగస్తులుగా, వ్యాపారస్తులుగా ఉంటూ సమాజంలో మంచి మార్గాన పయనిస్తుండడం శుభదాయకమని ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు తెలిపారు. చదువుకున్న పాఠశాలను గుర్తుపెట్టుకుని, ఆ సంవత్సరంలో ఉన్నటువంటి బాల బాలికలను, ఉపాధ్యాయులను నేడు ఒకే వేదిక పైకి తెచ్చి సత్కరించటం ఓ మధురానుభూతిని కలిగిస్తుందని సమ్మేళనంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. అనంతరం ఒకరికొకరు గురువులతో సెల్ఫీ ఫోటోలు దిగి తమ జీవితంలో గుర్తుండిపోయేలా పెట్టుకుంటామని ఆనందోత్సవాలతో పూర్వ విద్యార్థులు తెలిపారు. ఆత్మీయ అలింగనాలు, పలకరింపులతో, బాల్య స్మృతుల గుర్తుతో సమ్మేళనంలో సాయంత్రం దాకా సందడిగా, ఆనందంగా గడిపారు. ఆత్మీయ సమావేశంలో వై ఆర్ఎస్ఎస్ హై స్కూల్ కరస్పాండెంట్ ఏచూరి వెంకట సైదయ్య, హెచ్ఎం కొత్త చంద్రశేఖర్, ఈశ్వర్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ కదిరి డివిజన్ నూతన కమిటీ ఎన్నిక



తనకల్లు, (శుభోదయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ కదిరి డివిజన్ నూతన కమిటీ ఎంపిక ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షులు పుల్లయ్య అధ్యక్షతన జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. తాలూకా అధ్యక్షుడు గా ప్రవీణ్ కుమార్ రెడ్డి (ఆంధ్రప్రభ), జనరల్ సెక్రటరీ సాదిక్ వలి, (వార్త), ఆర్గనైజర్ సెక్రెటరీ నరేందర్ రెడ్డి (99 టీవీ). ట్రెజరర్ జిలాన్ (సాక్షి), వైస్ ప్రెసిడెంట్ గా శివశంకర్ (సూర్య) ,రవి (సాయంకాలం) చంద్రశేఖర్ రెడ్డి (ఆర్ టివి). జనరల్ సెక్రటరీ. ప్రభాకర్ (సూర్య) రామ్మోహన్ (సాక్షి) అల్లా బకాష్ (వార్త) సభ్యులు శ్రీనివాస్ (విశాలాంధ్ర) సతీష్ రెడ్డి (ఆంధ్రప్రభ) ఆంజనేయులు (వార్త) అజయ్ (కదిరి డిజిటల్ కేబుల్) లక్ష్మీపతి (ఆంధ్రప్రభ) మాధవ (సూర్య) రఘునాథ్ రెడ్డి, (సాక్షి) శివ శంకర్ రెడ్డి( సాక్షి), రాజశేఖర్ రెడ్డి (వార్త) ఎంపికయ్యారు.

# తనకల్లు సాయిబాబా గుడి గోపురం పై పిడుగుపాటు



తనకల్లు, (శుభోదయం న్యూస్): మండల కేంద్రంలో నిన్న తెల్లవారుజామున కురిసిన వర్షానికి మదనపల్లి రోడ్డులో ఉన్న సాయిబాబా గుడి గోపురం పై పిడుగు పడింది. పిడుగుపాటు వల్ల ఏ ప్రమాదం జరగలేదని ఆలయ ధర్మకర్త సత్యనారాయణ తెలిపారు. పిడుగు పడిన సమయంలో గుడిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని, ఆ సాయినాథుడే ప్రమాదాన్ని తప్పించారని ఆయన అన్నారు. గుడి గోపురం పైన చిన్న పగులు వచ్చిందని పెద్దగా ప్రమాదం ఏమి జరగలేదని ఆయన అన్నారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్



తనకల్లు, (శుభోదయం న్యూస్): రాబడిన సమాచారం మేరకు తనకల్లు ఎస్ఐ మరియు వారి సిబ్బంది తనకల్లు మండలం ఈతోడు గ్రామ శివార్లలో కోడిపందాల స్థావరంపై దాడి నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి .30,350/- , రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకుని వారందరిపై కేసు నమోదు చేయడమైనది.

# శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రులకు అందరూ కలసికట్టుగా పనిచేయాలి : కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

## భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అధికారులు భాధ్యతగా పనిచేయాలి



నెల్లూరు జిల్లా, (శుభోదయం న్యూస్): సింహపురి వాసులచే తొలి పూజలందుకునే శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవి శరన్నవరాత్రి మహోత్సవములు ఘనంగా నిర్వహించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కోరారు.శ్రీ ఇరుకళల



పరమేశ్వరి అమ్మవారి దేవి శరన్నవరాత్రి మహోత్సవములు అక్టోబర్ 3 నుండి 12 వ తేదీ వరకు నిర్వహించనున్న దృష్ట్యా నెల్లూరు ఆర్డీఓ మలోల ఆధ్వర్యంలో దేవాలయ ప్రాంగణంలో సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి విచ్చేసిన శాసనసభ్యులు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు విశేషంగా భక్తులు హాజరవుతారని అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు.ఆధ్యాత్మిక భావన దెబ్బతినకుండా అమ్మవారి దర్శనం సంపూర్ణంగా జరిగిందని భక్తులు సంతృప్తిని వ్యక్తం చేసేవిధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు.ఇందుకుగాను వట్టూరు సురేంద్ర యాదవ్ చైర్మన్ గా ఉత్సవ కమిటీను ఏర్పాటు చేశామన్నారు.ఉత్సవ కమిటీ సభ్యులు పదవిగా భావించకుండా బాధ్యతగా భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు.నిరంతర మంచినీటి వసతి సౌకర్యం అంతరాయం లేని విద్యుత్ సౌకర్యం క్యూ లైన్లలో తోపులాటలు జరగకుండా నిరోధించడం తదితర ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ సందర్భంగా ఉత్సవ విశేషాలను తెలిపే బ్రోచర్ ను యం ఎల్ ఎ శ్రీధర్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సమావేశంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్ రెడ్డి ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఆరుగురి అరెస్ట్

తనకల్లు, ( శుభోదయం న్యూస్): తనకల్లు మండలం, బాలసముద్రం గ్రామం శివాలయం పరిసర ప్రాంతంలో ఆదివారం బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఆరుగురిని తనకల్లు ఎస్సై గోపి వారి సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేసి వారిపై పెట్టి కేసు నమోదు చేయడమైనది. ఎస్సై మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నేరమని, ఆ విధంగా ఎవరు సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన మందు బాబులను హెచ్చరించారు.

# కోడి పందెం రాయళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు

## దాడులు నిర్వహించిన తనకల్లు పోలీస్ సిబ్బంది, ఎస్షై



తనకల్లు, (శుభోదయం న్యూస్): మండల పరిధిలోని ఈతోడు గ్రామశివారులోని కోడిపందెం ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో తనకల్లు ఎస్సై గోపి, మరియు సిబ్బంది మెరుపు దాడులు చేసి ఐదుగురుని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 30,350 /-నగదును స్వాధీనం చేసుకుని, అదేవిధంగా రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడమైనదని ఆదివారం ఎస్సై ఈ సందర్భంగా తెలియజేశారు. ఎస్సై గోపి మాట్లాడుతూ::- అసాంఘిక కార్యక్రమాలు ఎవరు చేపట్టిన, ఎంతటి వారినైనా ఉపేక్షించే పరిస్థితి లేదని, అదేవిధంగా ఈరోజు కోడిపందెం ఆడుతున్నట్లు పక్కా సమాచారం తెలియడంతో మా బృందం మెరుపు దాడులు చేసి కోడి పందెం రాయల్ను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 30,350 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గోపీ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తనకల్లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డిపి పోలయ్య ఆధ్వర్యంలో కుల నిర్మూలన పై అవగాహనా సదస్సు



రాపూరు మండలం (గిలకపాడు) (శుభోదయం న్యూస్) : బ్రాహ్మణీయ హిందూత్వ పాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా సి పీ ఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు నెల్లూరు జిల్లా సిపిఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో గిలకపాడు గ్రామం ఎస్ టి కాలనీలో లో కుల నిర్మూలన పై సిపిఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ నెల్లూరు జిల్లా కార్యదర్శి డిపి పోలయ్య ఆద్వర్యంలో కుల నిర్మూలన పై అవగాహన సదస్సు ను నిర్వహించారు.ఈ సదస్సు లో ఆయన మాట్లాడుతూ ప్రపంచం లో ఏ దేశం లోలేని విధంగా ఈ దేశం లో అవమానీయ దుర్మార్గ కుల వ్యవస్థ ఏర్పడి మూడు వేల సంవత్సరాలు గా కొనసాగుతోందన్నారు.ప్రజలు వర్గం జాతి మతం తో పాటు సాంఘిక కులాలు ప్రాతి పదిక పై విభజించ బడి ఉన్నారన్నారు.హిందూమతం కుల



వ్యవస్థకు ప్రాతి పాదిక అయితే తరువాత క్రమం లో క్రైస్తవ మహమ్మదీయ సిక్కు మతాల లో కులాలు ఏర్పడ్డాయన్నారు.నేడు మూడు వేల కులాలు లక్షకు పైగా విభజించబడి ఉన్నాయన్నారు.ఈ వర్ణ వ్యవస్థలకు వ్యతిరేకంగా ఎందరో మహనీయులు కృషి చేశారన్నారు.మధ్య యుగాల కాలం లోకుల వ్యతిరేక ఉద్యమం భక్తి ఉద్యమం పేరు తోకొనసాగిందన్నారు.కుల నిర్మూలన కోసం జ్యోతి బాబా పూలే సత్య శోధక్ సమాజ్ ను స్థాపించి నిర్విరామంగా కృషి చేశారన్నారు.సత్య శోధక్ సమాజ్ 152 వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని బ్రాహ్మణీయ హిందూత్వ పాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 24 నుండి 30 వరకు దేశ వ్యాప్తంగా కుల నిర్మూలన అవగాహన సదస్సులు సభలు ప్రదర్శనలు సహపంక్తి భోజనాలు నిర్వహించాలని సిపి ఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ పిలుపునిచ్చిందన్నారు.అంటరాని యువతి యువకుల కోసం పాఠశాలలను నెలకొల్పారన్నారు.ఆడబిడ్డలకు ప్రత్యేక పాఠశాల నెల కొల్పి వారికి విద్యను అందించడం కోసంతన బార్య సావిత్రి బాయి పూలే కి చదువు నేర్పి శిక్షణ యిచ్చారన్నారు.తొలి మహిళా ఉపాధ్యాయు రాలుగా సావిత్రి బాయి పూలే అగ్ర కుల చీ దరింపులకు బెదిరింపులకు దాడులను లెక్క చేయ కుండా జ్యోతి బాపులే బాటలో పయనించిందన్నారు.1873 లో సెప్టెంబర్ 24న సత్య శోధ క్ సమాజాన్ని స్థాపించి అవమానీయ కుల నిర్మూలన కోసం జీవితాంతం కృషి చేశారన్నారు.నేడు ప్రభుత్వాలు దళితులకు అది వాసీలకు పీడిత ప్రజానీ కానికి యిచ్చే సంక్షేమ పథకాలు తీసుకొచ్చే సంస్కరణలు కేవలం వారిని నిత్యం ప్రభుత్వాల పై ఆధార పడే వాళ్ళు గా తయారు చేయడం తప్ప మరొకటి కాదన్నారు.ఆయా వర్గాల విముక్తి మాత్రం భూమి సమస్య తోనే ముడి పడి ఉందన్నారు.గతం లో ప్రభుత్వం వేసిన కోనేరు రంగారావుకమిషన్ ప్రతి పేద కుటుంబానికి రెండు ఎకరాలు భూమి పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉందన్నారు.కానీ భూ పంపిణీ జరగ లేదన్నారు.భూ పోరాటాలకు దళిత ఆది వాసి పీడిత ప్రజానీకం సమాయత్తం కావాలన్నారు.ఆ బాటలో దళితులు ఆది వాసి లు పీడిత ప్రజలు పయనించాలని కోరారు.కుల వ్యవస్థకు మూలమైన అర్ధ వలస అర్ధ భూస్వామ్య వ్యవస్థ నూతన ప్రజా స్వామిక విప్లవం ద్వారా కూల్చి వేయాలన్నారు.ఈ కార్యక్రమం లో అఖిల భారత రైతు కూలీసంఘం కార్యదర్శి ఎం అంకయ్య కె రమణ రాజు ఎం కిష్టయ్య,ఎం రత్నమ్మ, సులోచన మ్మ లు పాల్గొన్నారు.

# స్వచ్ఛతా హీ సేవ-2024 నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మల్కాపూర్ లో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమం





గోదావరిఖని టౌన్: (శుభోదయం న్యూస్) : స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమం లో భాగంగా ఆదివారం మల్కాపూర్ చెరువు పరిసరాలను పరిశుభ్రం చేశారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్ , సూపర్వైజర్ బండారి రవి , ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కూల్చివేతలపై హైడ్రా ప్రకటన..

## ఈ కూల్చివేతలకు హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదు



సంగారెడ్డి మల్కాపూర్ చెరువులో కూల్చివేతలు హైడ్రా చేపట్టలేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటన విడుదల చేశారు. ఈ కూల్చివేతలకు హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు.దీనిని హైడ్రా కు ముడిపెడుతూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు రావడం విచారకరమని, హైడ్రా ఇలాంటి తప్పుడు వార్తలు ఖండిస్తోందని ఆయన అన్నారు. హైడ్రాను అప్రతిష్టపాలు చేయడానికి కొంతమంది చేస్తున్న ప్రయత్నాలను సామాజిక మాధ్యమాలు అనుసరించవద్దని విన్నవిస్తున్నామన్నారు. హైడ్రా కు సంబంధం లేని ఘటనలను ఆపాదిస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ అప్రతిష్టపాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.సంగారెడ్డి ఘటనలో హోం గార్డ్ కి గాయమై చనిపోతే%ౌ% హైడ్రా బలి తీసుకుంది అని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడం దురదృష్టకరమని, కూల్చివేతలు అన్నీ హైడ్రా కు ముడి పెట్టవద్దని ఆయన సూచించారు. అంతేకాకుండా%ౌ% ఇటీవల కూకట్పల్లి చెరువు పరిసరాల్లో ఇంటిని కూల్చి వేస్తారేమో అని బుచ్చమ్మ అనే మహిళా ఆత్మహత్య చేసుకోవడాన్ని కూడా హైడ్రాకు ఆపాదించారని, హైడ్రా నోటీసులు కూడా ఇవ్వలేదని ఆయన వెల్లడించారు. అదిలాబాద్ జిల్లాలో కూల్చివేతలు జరిగిన హైడ్రాకు ఆపాదిస్తూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు వస్తున్నాయని, ఔటర్ రింగు రోడ్డు వరకే హైడ్రా పరిధి అనేది అందరూ గ్రహించాలన్నారు హైడ్రా కమిషనర్ రంగనాథ్.

# డిజిటల్ మీడియా సమస్యలు పరిష్కరించాలి

## డిజిటల్ మీడియాలో పనిచేస్తున్న వారిని జర్నలిస్టుగా గుర్తించాలి

## డియంజెయు రాష్ట్ర సహాయ కార్యదర్శి కాడిగల్ల ప్రవీణ్ కుమార్



శంకర్ పల్లి, సెప్టెంబర్ 29(శుభోదయం న్యూస్): ఆదివారం శంకర్ పల్లి స్థానిక అతిథి గృహంలో డి యం జె యు నాయకుల సమావేశం జరిగింది. త్వరలో డి యం జె యు మండల నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని రాష్ట్ర సహాయ కార్యదర్శి కాడిగల్ల ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగాక సామాజిక మాధ్యమాలలో మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ప్రింట్ మీడియా ఆ తర్వాత ఎలక్ట్రానిక్ మీడియా, ప్రస్తుతం డిజిటల్ మీడియా అనివార్యం అయింది. ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా ఎప్పటి సమాచారాన్ని అప్పుడే ప్రజలు తెలుసుకుంటున్నారు. డిజిటల్ మీడియా అవసరం అందరికి తెలిసిందే గతంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేసిన జర్నలిస్టులు వారి వ్యక్తిగత పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడు డిజిటల్ మీడియా వైపు పరుగులు తీస్తున్నారు. ఎన్నో కష్ట నష్టాలను భరిస్తూ డిజిటల్ మీడియాలో రిపోర్టింగ్ చేస్తున్న వారిపై దాడులు చేస్తూ డిజిటల్ మీడియాను చులకనగా చూస్తున్నారు. ఈ రోజు డిజిటల్ మీడియా ప్రాముఖ్యత సంతరించుకుంది. సాటిలేట్ మీడియాకు కూడా అనివార్యంగా డిజిటల్ మీడియా అవసరం ఏర్పడింది. నిరంతర వార్తలు కవర్ చేస్తూ డిజిటల్ మీడియాలో టెలికాస్టింగ్, పబ్లిషింగ్ చేస్తున్న వారందరిని ప్రభుత్వం మీడియా అకాడమి మరియు పిఆర్, డి పి ఆర్ ఓ లు గుర్తించి డిజిటల్ మీడియాలో పని చేస్తున్న వారిని జర్నలిస్టులుగా గుర్తించి అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని, అలాగే జర్నలిస్టుల భద్రత కోసం మీడియా కమీషన్ ఏర్పాటు చేయాలని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో డి యం జె యు నాయకులు రాజేశ్ గౌడ్, దుర్గ ప్రసాద్, మైపాల్ రెడ్డి, పరమేష్, సునిల్ గౌడ్, ఆనంద్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# స్టార్ మోటార్ డ్రైవింగ్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న యువనాయకుడు మాదిరి ప్రిథ్వీరాజ్






పటాన్చెరు: (శుభోదయం న్యూస్) : పటాన్ చెరు నియోజకవర్గంలోని వెలిమెలలో స్టార్ మోటార్ డ్రైవింగ్ స్కూల్ ను ఎం డి ఆర్ ఫౌండేషన్ కో - ఫౌండర్, బీఆర్ఎస్ యువనాయకుడు మాదిరి ప్రిథ్వీరాజ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ సంస్థ నిర్వాహకులు షబ్బీర్ గారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉండే క్రైమ్ బ్రాంచ్ సిఐ రవి గారితో కలిసి స్టార్ మోటార్ డ్రైవింగ్ స్కూల్ విజయవంతంగా నడవాలని ఆయన ఆకాక్షించారు.

# హైదరాబాద్ వాసులకు శుభవార్త.. ఆ నగరాలకు నేరుగా విమాన సర్వీసులు..!




హైదరాబాద్ వాసులకు శుభవార్త. హైదరాబాద్ నుంచి కొత్తగా విమాన సర్వీసులు ప్రారంభం అయ్యాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ హైదరాబాద్ విమానాశ్రయం నుంచి కొత్త డైరెక్ట్ ఫ్లైట్‌లను ప్రారంభించింది. సెప్టెంబర్ 28న విమానయాన సంస్థ హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్, ఆగ్రాలకు డైరెక్ట్ విమానాలను నడుపుతోంది. దేశీయ విమాన ప్రయాణానికి కీలకమైన కేంద్రంగా రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మారుతుందని చెబుతున్నారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ ఆరు నగరాలకు డైరెక్ట విమాన సర్వీసులు నడిపిస్తోంది. హైదరాబాద్ నుంచి నేరుగా అగర్తల, కాన్పూర్, ఆగ్రా, జమ్మూ, ప్రయాగ్‌రాజ్, అయోధ్య విమాన సర్వీసులు నడుస్తోన్నాయి. హైదరాబాద్ నుంచి ప్రయాగ్ రాజ్ కు శనివారం విమాన సర్వీస్ ప్రారంభమైంది. విమానం ఉదయం 8:55 గంటలకు బయలుదేరి 10:50 గంటలకు ప్రయాగ్‌రాజ్‌కి చేరుకుంటుంది. అలాగే హైదరాబాద్ ఆగ్రాకు నేరుగా విమానాలు నడుస్తున్నాయి. ఈ విమానాలు వారానికి మూడు రోజులు నడుస్తాయి. ఆగ్రా విమానం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి మధ్యాహ్నం 1:55 గంటలకు బయలుదేరి సాయంత్రం 4:05 గంటలకు ఆగ్రా చేరుకుంటుంది. అలాగే కాన్పూర్ కూడా హైదరాబాద్ నుంచి విమానాలు నడుస్తోన్నాయి. ఈ విమాన సర్వీస్ వారానికి నాలుగు రోజులు కొనసాగుతాయి. ఈ విమానం హైదరాబాద్ శంషాబాద్ ఎయిరి పోర్ట్ నుంచి ఉదయం 8:55 గంటలకు బయలుదేరి ఉదయం 11:00 గంటలకు కాన్పూర్ చేరుకుంటారు. హైదరాబాద్ నుంచి అయోధ్యకు కూడా నేరుగా విమానాలు నడుస్తోన్నాయి. ఈ విమానం కూడా వారంలో నాలుగు రోజులు అందుబాటులో ఉంటుంది. ఈ విమానం మధ్యాహ్నం 1:55 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు అయోధ్యకు చేరుకుంటుంది. ఈ వమానం సోమ, బుధ, శుక్రవారాలు, ఆదివారం నడుస్తుంది. హైదరాబాద్ నుంచి అగర్తలకు కూడా విమాన సర్వీసులు కొనసాగుతోన్నాయి. ఈ విమానం వారానికి 4 రోజులు అందుబాటులో ఉంటుంది. విమానాలు ఉదయం 7:30 గంటలకు బయలుదేరి 10:20 గంటలకు అగర్తలకు చేరుకుంటుంది. అలాగే హైదరాబాద్ నుంచి జమ్మూకు కూడా నేరుగా విమానాలు నడుస్తోన్నాయ. ఈ విమానం వారానికి మూడు రోజులు అదుబాటులో ఉంటుంది. శంషాబాద్ నుంచి ఉదయం 7:05 గంటలకు బయల్దేరి ఉయం 10:10 గంటలకు జమ్మూ చేరుకుంటుంది.

# ఖర్గేకు ప్రధాని మోదీ ఫోన్.. ఆరోగ్యంపై ఆరా



దిల్లీ: జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. ఓ సభలో ప్రసంగిస్తూ అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఖర్గేకు ఫోన్ చేసిన ప్రధాని మోదీ . ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఖర్గే త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కఠువా జిల్లాలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న ఖర్గే.. ప్రసంగిస్తున్న సమయంలో సొమ్మసిల్లారు. దాంతో పక్కనే ఉన్న భద్రతా సిబ్బంది, సహచరులు ఆయన్ను పట్టుకొని నీళ్లు తాగించి సేదదీరేలా చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే తన ప్రసంగం కొనసాగించిన ఖర్గే.. ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ మాట్లాడారు. తాను ఎనభైలలో ఉన్నానని, ఇప్పుడే మరణించబోనన్నారు. ప్రధాని మోదీని అధికారం నుంచి దించే వరకు తాను బతికే ఉంటానని వ్యాఖ్యానించారు. ఖర్గేకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిపారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## పాకిస్థాన్‌కు 'ఐఎంఎఫ్' పాట్లు..

# లక్షన్నర ఉద్యోగాలు కోత!



ఇస్లామాబాద్: దేశ ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టేందుకు పాకిస్థాన్ కొన్నేళ్లుగా సతమతమవుతోంది. ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కేందుకు రుణసాయం విషయంలో నానా పాట్లు పడుతోంది. తాజాగా ఏడు బిలియన్ డాలర్ల రుణ ఒప్పందం విషయంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ చెప్పిన షరతులకు తలూపింది. ఇందులో భాగంగా పాలనాపర వ్యయాలను తగ్గించుకునేందుకు దేశంలో దాదాపు 1,50,000 ప్రభుత్వ ఉద్యోగాలకు కోత పెట్టనున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా ఆరు మంత్రిత్వ శాఖలకు స్వస్తి పలికి.. మరో రెండింటిని విలీనం చేయనున్నట్లు తెలిపింది. గత ఏడాది పాకిస్థాన్ దివాలాకు చేరువైనప్పటికీ.. ఐఎంఎఫ్ ద్వారా మూడు బిలియన్ డాలర్ల రుణ సాయంతో గండం నుంచి గట్టెక్కింది. ఇదే చివరిసారి అంటూ.. దీర్ఘకాలిక రుణం కోసం ఐఎంఎఫ్‌తో కొంతకాలంగా సుదీర్ఘ చర్చలు జరిపింది. సహాయ ప్యాకేజీ విషయంలో ఎట్టకేలకు సెప్టెంబరు 26న ఐఎంఎఫ్ ఆమోదం తెలిపింది. ఖర్చులు తగ్గించుకోవడం, పన్ను- జీడీపీ నిష్పత్తిని పెంచడం, వ్యవసాయం, రియల్ ఎస్టేట్ వంటి రంగాలపై పన్ను, రాయితీలు తగ్గించడం వంటి చర్యలకు పాకిస్థాన్ హామీ ఇవ్వడంతో.. మొదటి విడతగా ఒక బిలియన్ డాలర్లను విడుదల చేసింది. "ఇదే చివరి ప్యాకేజీ అని నిరూపించేలా మా విధానాలను అమలు చేయాల్సి ఉంటుంది. 'జీ20' కూటమిలో చేరడానికి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాల్సి ఉంది. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ఆరు మంత్రిత్వ శాఖలను మూసివేయనున్నాం. రెండు మంత్రిత్వ శాఖలు విలీనం కానున్నాయి. వివిధ మంత్రిత్వ శాఖల్లో 1,50,000 పోస్టులను తొలగించనున్నాం" అని పాకిస్థాన్ ఆర్థిక మంత్రి మహమ్మద్ ఔరంగజేబు వెల్లడించారు. దేశంలో పన్ను చెల్లింపుదారుల సంఖ్య 16లక్షల నుంచి 32 లక్షలకు పెరిగిందన్నారు. పన్నులు చెల్లించని వారు ఇకపై ఆస్తులు, వాహనాలు కొనుగోలు చేయలేరని చెప్పారు.

# హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లా మృతదేహం గుర్తింపు..



ఇంటర్నెట్ డెస్క్: హెజ్‌బొల్లా లక్ష్యంగా ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగిస్తోంది. ఈ దాడుల్లో ఇటీవల హతమైన హెజ్‌బొల్లా అధిపతి హసన్ నస్రల్లా మృతదేహం ఆచూకీ లభ్యమైంది. బీరుట్‌లోని దక్షిణ శివారు ప్రాంతం నుంచి తమ నాయకుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హెజ్‌బొల్లా తాజాగా వెల్లడించింది. అయితే.. నస్రల్లా మృతదేహంపై ప్రత్యక్షంగా ఎలాంటి గాయాలు కనిపించలేదని సమాచారం. దీంతో, బాంబు దాడి జరిగిన సమయంలో షాక్‌కి గురై ఆయన మరణించి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. హెజ్‌బొల్లాను లక్ష్యంగా చేసుకున్న ఐడీఎఫ్ దళాలు బీరుట్ ప్రధాన ప్రాంతాల్లో భీకర స్థాయిలో విరుచుకుపడ్డాయి. ఈ క్రమంలోనే రాజధానిలోని హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై విధ్వంసకర బాంబులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హసన్ నస్రల్లా మృతి చెందారని ఇజ్రాయెల్ ధ్రువీకరించింది. అంతేకాకుండా ఆయన కుమార్తె కూడా మరణించినట్లు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి.

### మరి ఎలా చనిపోయారు..?

ఇజ్రాయెల్ దాడుల్లో తమ అధినేత మరణించినట్లు హెజ్‌బొల్లా సైతం ప్రకటించింది. అయితే.. దీనికి తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటామని.. పాలస్తీనాకు మద్దతుగా నిలవడంతో పాటు శత్రువుపై యుద్ధం కొనసాగిస్తామని హెజ్‌బొల్లా ప్రతినబూనింది.

# కేంద్ర ప్రభుత్వంపై కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు



కేంద్రప్రభుత్వంపై ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం హర్యానాలో జరిగిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. 'జైలులో నన్ను మానసికంగా, శారీరకంగా చిత్రహింసలు పెట్టేందుకు ప్రయత్నించారు. నేను షుగర్ పేషేంట్‌ను. నాకు రోజుకు నాలుగు ఇన్సులిన్ ఇంజెలిక్షన్లు అవసరం. జైలులో నాకు ఇన్సులిన్ ఇంజెక్షన్లు అందకుండా చేశారు. వారికి తెలియని విషయం ఏంటంటే. వాళ్లు నన్ను ఏమీ చేయలేరు. ఎందుకంటే నేను హర్యానా బిడ్డను' అని పేర్కొన్నారు.

# జనవరిలో కుంభమేళాకు 992 ప్రత్యేక రైళ్లు



వచ్చే ఏడాది జనవరిలో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా జరుగనుంది. దీని కోసం పెద్ద సంఖ్యలో ప్రత్యేక రైళ్లను నడిపేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. కుంభమేళా సందర్భంగా 992 ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు సీనియర్ రైల్వే అధికారి ఒకరు తెలిపారు. ప్రత్యేక రైళ్లను నడపడంతో పాటు వివిధ మౌలిక సదుపాయాలు, ప్రయాణికులకు సౌకర్యాల కల్పన కోసం మంత్రిత్వశాఖ రూ.933 కోట్లను సైతం కేటాయించింది.

# నన్ను, శరద్ పవార్‌ని దెబ్బతీయాలని అమిత్ షా ఆదేశించారు..



ప్రతిపక్ష నేతల్ని దెబ్బతీయాలని బీజేపీ నాయకులకు ఆదేశాలు అందాయని శివసేన(యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను, ఎన్సీపీ(ఎస్పీ) శరద్ పవార్లను లక్ష్యంగా చేసుకోవాలని బీజేపీ నేతలకు క్లోజ్ డోర్ మీటింగ్‌లో అమిత్ షా ఆదేశించారని ఆరోపించారు. ఆదివారం జరిగిన ఓ సభలో మాట్లాడుతూ.. తన రాజకీయ భవిష్యత్తుని ప్రజలే నిర్ణయిస్తారని, అధికారంలో ఉన్న బీజేపీ కాదని అన్నారు. తనను (ఉద్ధవ్) మరియు శరద్ పవార్‌ను రాజకీయంగా నిలువరించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా బీజేపీ నాయకులను ఆదేశించారని, అమిత్ షా నాగ్‌పూర్ పర్యటించిన సమయంలో బీజేపీ నాయకులతో మీటింగ్ నిర్వహించారని చెప్పారు. క్లోజ్ డోర్ మీటింగ్‌లో ఆదేశాలు అందాయని అన్నారు. తలుపుల వెన ఎందుకు మాట్లాడాలి..? ప్రజలు ముందు ఈ విషయం చెప్పాలని సవాల్ విసిరారు. మహారాష్ట్ర రామ్‌టెక్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కార్యక్రమంలో ఠాక్రే పాల్గొన్నారు. ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌లను రాజకీయంగా అంతం చేయాలని అమిత్ షా ఎందుకు అనుకుంటున్నారని.. మహారాష్ట్రను బీజేపీ దోచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. 2014లో శివసేనతో మూడు దశాబ్దాల పొత్తుని బీజేపీ తెంచుకుందని ఠాక్రే అన్నారు. ఇతర పార్టీలను విచ్ఛిన్నం చేయడం, ప్రతిపక్ష నేతల్ని వేటాడడాన్ని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవన్ ఏకీభవిస్తున్నారా..? అని ఠాక్రే ప్రశ్నించారు. రాబోయే ఎన్నికలు అధికారం కోసం కాదని, మహారాష్ట్రని దోచుకోకుండా నిరోధించడానికి చాలా కీలకమని అన్నారు. మహా వికాస్ అఘాడీకి భారీ విజయాన్ని అందించాలని, రామ్ టెక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మొత్తం ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, ఎన్సీపీ(ఎస్పీ) నేతలు సునీల్ కేదార్, అనిల్ దేశ్‌ముఖ్ పాల్గొన్నారు.

# ఎఫ్‌పీఐ పెట్టుబడుల్లో రికార్డు.. తొమ్మిది నెలల తర్వాత ఇదే ఫస్ట్ టైం..!




ఈక్విటీ మార్కెట్లలోకి సెప్టెంబర్ నెలలో రూ.57,359 కోట్ల విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐ) వచ్చి చేరాయి. గత తొమ్మిది నెలల్లో ఇదే గరిష్టం. కీలక వడ్డీరేట్లు తగ్గిస్తూ యూఎస్ ఫెడ్ రిజర్వ్ నిర్ణయం తీసుకోవడంతోపాటు దేశీయ ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉండటం వల్లే విదేశీ ఇన్వెస్టర్లు భారత్ ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్నారని తెలుస్తోంది. ఈ నెల 27 నాటికి ఈ నెలలో రూ.57,359 కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు వచ్చాయి. గతేడాది డిసెంబర్ తర్వాత దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి అత్యధికంగా పెట్టుబడులు రావడం ఇదే మొదటిసారి. 2023 డిసెంబర్‌లో రూ.66,135 కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్, మే నెలల్లో ఎఫ్‌పీఐలు నిధులు ఉపసంహరించుకున్నా, జూన్ నుంచి ఎఫ్‌పీఐలు నికరంగా దేశీయ ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్నారు. జనవరి, ఏప్రిల్, మే నెలలు మినహా మిగతా ఆరు నెలల్లో ఎఫ్‌పీఐలు స్థిరంగా ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్నారు. ఏప్రిల్-మే నెలల్లో రూ.34,252 కోట్ల విలువైన పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

# సునీతా విలియమ్స్, విల్‌మోర్‌లను భూమికి తెచ్చేందుకు వెళ్లిన నౌక




అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన భారత సంతతికి వ్యోమగామి సునీతా విలియమ్స్‌తో పాటు బుచ్ విల్‌మోర్‌లను తీసుకొచ్చేందుకు రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభమైంది. ఫ్లోరిడాలోని కేప్ కెనవరాల్ నుంచి ఎలాన్ మస్క్ సంస్థ స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ఆదివారం నింగిలోకి దూసుకెళ్లింది. ఐఎస్ఎస్‌లో కొద్ది నెలలుగా చిక్కుకున్న సునీత్ విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లను తీసుకొచ్చేందుకు స్పేస్‌ఎక్స్ రాకెట్ బయలుదేరిందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా వెల్లడించింది. వ్యోమనౌకలో ఇద్దరు వ్యోమగాములు వెళ్లారని, మరో రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. తిరుగు ప్రయాణంలో ఐఎస్ఎస్ నుంచి విలియమ్స్, విల్‌మోర్‌లను తీసుకురానున్నారని తెలిపింది. నాసా వ్యోమగామి నిక్ హేగ్, రష్యాకు చెందిన కాస్మోనాట్ అలెగ్జాండర్ గోర్బునోవ్‌లు.. సునీత విలియమ్స్, బారీ బుచ్ విల్‌మోర్‌లకు అవసరమైన సరుకులతో ఆకాశంలోకి వెళ్లారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సునీతా, విల్‌మోర్‌లను తిరిగి భూమి మీదకు తీసుకురావాలని భావిస్తున్నారు. బోయింగ్ కంపెనీ రూపొందించిన స్టార్‌లైనర్ అనే వ్యోమనౌకలో సునీతా, విల్‌మోర్‌లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. ఈ వ్యామనౌక ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు చేరుకోవడానికి ముందే అందులోని ప్రొపల్షన్ సిస్టమ్‌లో లీకులు ఏర్పడటం, థ్రస్టర్స్ మూసుకుపోవడం లాంటి సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో8 రోజుల్లో వెనక్కి రావాల్సిన వ్యోమగాములు నెలల తరబడి ఐఎస్?ఎస్?లో చిక్కుకపోయారు. ప్రొపల్షన్ వ్యవస్థలో లోపాన్ని సవరించి వారిని భూమిపైకి తీసుకువచ్చేందుకు నాసా అనేక ప్రయత్నాలు చేసింది. స్టార్‌లైనర్ ద్వారా 2, 3 సార్లు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి. దీంతో ఫలితంగా నాసా, ఎలాన్? మస్క్? స్పేస్?ఎక్స్? సాయం తీసుకోవాల్సి వచ్చింది.

## 'కొత్త పార్టీకి నేను నాయకుడిని కాదు' : ప్రశాంత్ కిశోర్



దిల్లీ: ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కొత్తగా రాజకీయ పార్టీ స్థాపించేందుకు సిద్ధమయ్యారు. పార్టీ పేరు, నాయకత్వం సహా ఇతర వివరాలను అక్టోబర్ 2న ప్రకటిస్తామని వెల్లడించారు. అయితే, పార్టీ నాయకత్వం మాత్రం తన చేతుల్లో ఉండదన్నారు. రెండేళ్ల క్రితం తాను చేపట్టిన జన్ సురాజ్ యాత్రనే రాజకీయ పార్టీగా మలచనున్నట్లు ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది జరిగే బిహార్ శాసనసభ ఎన్నికల్లోనే పార్టీ తరఫున పోటీ చేస్తామని చెప్పారు. "ఆ పార్టీకి నేనెప్పుడూ నాయకుడిని కాదు. అలా ఉండాలనీ నేనెప్పుడూ అనుకోలేదు. ప్రజలే నాయకత్వ బాధ్యతలు స్వీకరించాల్సిన సమయమిది" అని ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. అక్టోబర్ 2, 2022న జన్ సురాజ్ పేరుతో ప్రారంభించిన యాత్ర రెండేళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఆయన.. కొత్త పార్టీ నాయకత్వ వివరాలను అక్టోబర్ 2న వెల్లడిస్తానని తెలిపారు. మూడు ప్రధాన ఉద్దేశాలతోనే జన్ సురాజ్ యాత్ర చేపట్టినట్లు ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు వారి చిన్నారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, తప్పుదోవ పట్టించే నాయకుల ఒత్తిడికి తలొగ్గి ఓట్లు వేయకుండా అవగాహన కల్పించడంతోపాటు రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో పర్యటించాలని ఈ యాత్ర చేపట్టానన్నారు. ఇప్పటివరకు 60శాతం యాత్ర పూర్తయిందని, తదుపరి కొనసాగుతుందన్నారు. అయితే, రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఈ యాత్ర కొనసాగుతుందన్న ఆయన.. పార్టీకి నాయకత్వ బాధ్యతలు మాత్రం తాను వహించడం లేదన్నారు.

## భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రజలకు పరిహారం..




**అమరావతి,:** ఏపీలో భారీ వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే.. వరదల ధాటికి విజయవాడ అతలాకుతలమైంది. దీంతో.. నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఆ సమయంలో అక్కడే ఉండి ఎప్పటికప్పుడూ పరిస్థితిని సమీక్షించారు. ఇదిలా ఉంటే.. భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రజల అకౌంట్లలోకి ప్రభుత్వం పరిహారం సాయం అందజేసింది. ఆస్తి, పంట నష్టం కింద 4 లక్షల మందికి రూ.602 కోట్లు పరిహారం చెల్లింపునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. నిధులు విడుదల చేసింది. ఇందులో భాగంగా ప్రజల అకౌంట్లలో ఇప్పటివరకు రూ. 569 కోట్లు జమ అయ్యాయి. బ్యాంక్ అకౌంట్లు యాక్టివ్‌గా లేకపోవడం వంటి కారణాలతో పరిహారం పెండింగ్‌లో ఉన్న వారికి సోమవారం నాటికి చెల్లింపులు జరుగనున్నాయి. వరద సాయం కార్యక్రమంలో భాగస్వాములు అయిన వారితో రేపు విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. వరద సాయంలో పగలు, రాత్రి కష్టపడి పనిచేసిన అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంధ సంస్థలు, పారిశుధ్య కార్మికులు, ప్రజలకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలుపనున్నారు.

## ఎంతకాలం బ్రతికాం అన్నది కాదు.. ఎలా బ్రతికామన్నది ముఖ్యం



**అమరావతి,:** విశాఖలో ఆంధ్ర యూనివర్సిటీ మాజీ రెక్టార్ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ 90 వసంతాల వేడుక నిర్వహించారు. అంకోసా హాల్లో 'నవతీ ప్రసన్నం' పేరిట నిర్వహించిన ఈ వేడుక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, విశిష్ట అతిథిగా మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. సెంటర్ ఫర్ పాలసీ వ్యవస్థాపకులుగా ఏయూ రెక్టార్ గా క్రికెట్ టెన్నిస్ వ్యాఖ్యాతగా ప్రొఫెసర్ ప్రసన్న కుమార సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఎంతకాలం బ్రతికామని కాదు ఎలా బ్రతికం అనేది చాలా ముఖ్యమని వెంకయ్య నాయుడు వెల్లడించారు. ఆనందకర జీవితము అందరూ కోరుకుంటారు దానిని సాధ్యం చేసుకోవడం చాలా గొప్ప విషయం అన్నారు. వ్యక్తి ఆలోచనకు సానుకూల ధోరణి చాలా అవసరం. యువకులు ప్రకృతితో కలిసి జీవించాలి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. మరణించిన తర్వాత జీవించాలి అంటే సేవా కార్యక్రమాలు అలవాటు చేసుకోవాలి. విశాఖలో తెన్నేటి విశ్వనాథం పరిచయంతో తన జీవన శైలి మారిందని తెలిపారు విశాఖలో ప్రముఖుల వల్ల తన జీవితంలో ఉన్నత శిఖరాలను చూడగలిగానని తెలిపారు.

## 60 అడుగుల లోతులో దుర్భేద్యమైన బంకర్.. అయినా, నస్రల్లాను ఎలా ఇజ్రాయిల్ చంపింది..



30 ఏళ్లుగా ఇజ్రాయిల్‌కి సవాల్ విసురుతున్న హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లాని శుక్రవారం వైమానికి దాడిలో హతమార్చింది. అత్యంతం గోప్యత పాటించే నస్రల్లాను టార్గెట్ చేసి బీరూట్‌పై ఇజ్రాయిల్ ఎయిర్ స్ట్రైక్స్ చేసింది. ఈ దాడిలో నస్రల్లా మరణించాడు. ఇప్పుడు అతడి మరణం ఇరాన్ మద్దతు కలిగిన హిజ్బుల్లా భవిష్యత్తుని ప్రశ్నార్థకంగా మార్చింది. నస్రల్లాతో పాటు మిలిటరీ చైన్‌లోని అత్యంత కీలకమైన కమాండర్లు అందరిని ఇజ్రాయిల్ హతమార్చింది. ఫువాద్ షుక్ర్, అలీ కర్కీ, ఇబ్రహీం అఖిల్ ఇలా ఒక్కొక్కరుగా చనిపోయారు. ఇదిలా ఉంటే, నస్రల్లా మరణమే ఇప్పుడు అందరిలో సంచలనంగా మారింది. తన ఉనికి కూడా బహిరంగ ప్రజానీకానికి తెలియనివ్వని నస్రల్లాకు సంబంధించి ఖచ్చితమైన సమాచారాన్ని ఇజ్రాయిల్ సేకరించి దాడులు చేసింది. బీరూట్ దక్షిణ ప్రాంతంలోని హిజ్బుల్లా సెంట్రల్ హెడ్‌క్వార్టర్‌లో కీలకమైన సమావేశానికి నస్రల్లా వస్తున్నాడనే సమాచారం, కేవలం దాడికి గంటల ముందు మాత్రమే ఇజ్రాయిల్ అధికారులకు అందినట్లు నివేదికలు చెబుతున్నాయి. దీంతో ఇన్ఫర్మేషన్‌ని కన్ఫార్మ్ చేసుకున్న ఇజ్రాయిల్ భారీ వైమానిక దాడి చేసింది. అయితే, దాదాపుగా 60 అడుగుల లోతులో ఉన్న దుర్భేద్యమైన బంకర్‌లో నస్రల్లా ఉన్నా కూడా, అతడిని ఇజ్రాయిల్ చంపేసింది. ఇది ఎలా సాధ్యమైందనేదే ఇప్పుడు అందరి ప్రశ్న. ఇందులోనే కీలకమైన సమావేశానికి నస్రల్లాతో పాటు ఇతర కీలక సభ్యులు హాజరయ్యారు. ఇజ్రాయిల్‌కి వ్యతిరేకంగా దాడి ప్లాన్ చేసేందుకు వీరంతా చర్చిస్తున్నారు. హిజ్బుల్లాతో పాటు ఇరాన్ సీనియర్ మిలిటరీ జనరల్ కూడా ఈ సమావేశానికి వచ్చాడు. ఈ బంకర్‌ని నామరూపాలు లేకుండా చేయడానికి ఇజ్రాయిల్ సైన్యం 80 టన్నునులు పేలుడు పదార్థాలను ఉపయోగించింది. వీటిలో 85 "బంకర్-బస్టర్" బాంబులు ఉన్నాయి. ఇవి చాలా స్ట్రాంగ్‌గా ఉండే నిర్మాణాల్లోకి కూడా చొచ్చుకుపోతాయి. 30 మీటర్ల వరకు భూమి లేదా ఆరు మీటర్ల మందం ఉన్న రీన్‌ఫోర్స్ట్ కాంక్రీటు ద్వారా గుచ్చుకోగల సామర్థ్యం వీటి సొంతం. బంకర్ బస్టర్ బాంబుల బరువు 907 కిలోల నుంచి 1814 కిలోలు ఉంటాయి. ఈ బాంబుల్ని రెండో ప్రపంచ యుద్ధం సమయంలో అభివృద్ధి చేశారు. "మేము ప్లాన్ చేసిన ప్రతీది ఖచ్చితంగా అమలు చేయబడింది. ఎలాంటి లోపాలు లేకుండా ఇంటెలిజెనస్, ప్రణాళిక, ఫైటర్ జెట్లు, ఆపరేషన్ సరిగ్గా జరిగింది." అని టైమ్స్ ఆఫ్ ఇజ్రాయిల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇజ్రాయిల్ ఎయిర్‌ఫోర్స్ 69వ స్క్వాడ్రన్ కమాండర్ విలేకరులతో చెప్పారు. న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ప్రసంగిస్తూనే ఈ దాడులకు ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అనుమతులు ఇచ్చారు.

# పీడీఎస్‌యూది 50 ఏళ్ళ పోరాట చరిత్ర




ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి ఉద్యమం 1969 నుండి కొత్త పుంతలు తొక్కింది. నూతన జవసత్వాలు సంతరించుకొని, నిస్తేజమైన వాతావరణాన్ని పటాపంచలు చేసింది. నూతనత్వానికై వెంపర్లాడుతున్న తరుణాన నక్సల్బరి, శ్రీకాకుళ పోరాటాలు వేగుచుక్కలై విద్యార్థి ఉద్యమాన్ని వెన్ను తట్టి నడిపించాయి. ఆ వరవడిలో నిర్మాణాత్మక రూపాన్ని సంతరించుకొంది ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ). ఒక విద్యార్థి సంఘం తన ఉద్యమ చరిత్రను నెమరు వేసుకోవడం, స్ఫూర్తి పొందడం అవసరం, ఆవశ్యకత కూడా. ఆనాడు, ఈనాడు, ఏనాడైనా మతోన్మాదానికి విచక్షణ వుండదు. పైశాచికత్వం దాని క్రీడ. దౌర్జ న్యం దాని ఊపిరి. దుర్మార్గం దాని విధానం. మూర?త్వం దాని లక్షణం. అది వికృత రూపాలలో అవతరించి సమాజాన్ని విషపూరితం చేస్తుంది. ఆర్ఎస్ఎస్ కూడా ఇందుకు మినహాయింపుకాదు. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని తమ స్థావరంగా చేసుకొని, అరాచక, రౌడీ, సంఘ విద్రోహ, అవినీతికర విధానాలతో విద్యార్థులను బాధించేది. బోగస్ అడ్మిషన్లతో, రౌడీలు హాస్టల్స్ లో తిష్ట వేసేవారు. విద్యార్థుల కోసం మెస్ అధికారులు వండిన మాంసం తదితర ప్రత్యేక భోజ నాలు కూడా విద్యార్థులకు సక్రమంగా అందనివ్వకుండా చేసేది. ఇక విద్యార్థినుల పట్ల అసభ్యంగా, అవమానకరంగా ప్రవర్తించేవారు.

### పీడీఎస్ పుట్టుక

అదే సమయంలో యూనివర్సిటీ సమస్యలతోపాటు, దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశా లపై నిరంతర చర్చలతో, సమావేశాలతో విప్లవ భావాలు గల విద్యార్థుల బృందం ఎడతెరిపిలేకుండా కృషిచేసింది. ఈ విద్యార్థులంతా సమావేశమై తమ బృందానికి ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థులు (పిడిఎస్)గా నామకరణం చేసుకున్నారు. పీడీఎస్ అత్యంత మెలకువతో, ఎక్కువ మంది విద్యార్థులతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నది. తన బృందాన్ని రాజకీయంగా, భౌతి కంగా సామాజికంగా చైతన్యం చేసింది. ప్రశ్నించే తత్వాన్ని నేర్పింది. అన్యాయాన్ని ఉపేక్షించొద్దనే దృఢమైన సంకల్పాన్ని వారి ముందు ఉంచింది.

### ఆ శక్తులన్నీ ఒక్కటై..

క్యాంపస్‌లో ప్రగతిశీల భావాల పుట్టుకను సహజంగా అభివృద్ధి నిరోధక ముఠా సహించలేక పోయింది. గాంధీ మెడికల్ కాలేజీ ఎన్నికల సందర్భంగా పీడీఎస్ విద్యార్థులపైన ఆర్ఎస్ఎస్ గుండాలు మొదటి దాడిచేశారు. అక్కడే వున్న క్యాంపస్ విద్యార్థుల సహాయంతో ఆ దాడిని ప్రతిఘటించారు. 1971 సెప్టెంబర్ 5న పీడీయస్ విద్యార్థులపైన దాడి చేశారు. దానిని కూడా తిప్పికొట్టారు. పై రెండు దాడుల తరవాత పీడీఎస్ విద్యార్థులు మరింత మెలకువలను ప్రదర్శించారు. ఒకవైపు విద్యార్థులతో విస్తృత సంబంధాలు కొనసాగిస్తూనే, మరొకవైపు ఆత్మరక్షణా చర్యలు తీసుకొన్నారు. పీడీఎస్ కార్యకర్తలు నిత్యం ఒక బృందంగా తిరగాల్సి వచ్చింది. ఒంటరిగా తిరగడం ప్రమాదకరంగా మారింది. ఆ సమయం లో నాయకత్వం ప్రధానంగా ధైర్య సాహసాలను కార్యకర్తలకు ప్రబోధించింది. "చేగువేరా" విప్లవ సాహస గాధలను బోధించడం గమనార్హమైంది. ఆ తర్వాత 1971 నవంబర్ 24వ తేదీన పీడీఎస్ కార్యకర్తలపైన మరొకదాడి జరిగింది. మళ్లీ పీడీఎస్ విద్యార్థులు తిప్పికొట్టారు. ఈ సారి ఉస్మానియా యూనివర్శిటీ అధికారులు, పరిపాలకులు, ఆర్ఎస్ఎస్, ఎబీవీపీ మతోన్మాద శక్తులు కుమ్మక్కై వర్సిటీలో వేలాది పోలీసులను దింపి విద్యార్థి నేతలను అరెస్ట్ చేసి, అక్రమ కేసులు బనాయించారు. 11 మంది విద్యార్థులను శాశ్వతంగా బహిష్కరించారు. కానీ విద్యార్థుల నిరసన తీవ్రం కావడంతో విశ్వవిద్యాలయాన్ని నిరవధికంగా మూసివేశారు.

### పీడీఎస్‌యూ ప్రథమ రాష్ట్ర మహాసభ

విప్లవ విద్యార్థి సంస్థ పీడీఎస్‌యూకి 2024 అక్టోబర్ 12, 13 తేదీల నాటికి 50 సంవత్సరాలు నిండుతున్నది. హైదరాబాద్ ఉస్మానియా గడ్డ మీద జార్జి రక్తంతో తడిసిన ఆ బిగిపిడికిలి పతాక జేసీఎస్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, చేరాలు, చాంద్ పాషా, స్నేహలత రంగవల్లి, రమణయ్య, సాంబయ్య తదితరుల త్యాగాలతో పులకరించింది. తెలంగాణ సాయుధ పోరాట వరవడిలో భారత రాజకీయ రంగానికి ప్రకంపనలు సృష్టించిన నక్సల్బరి, శ్రీకాకుళ, గోదావరి లోయ రైతాంగ పోరాటాలు ప్రజల విముక్తి బాటను గుర్తు చేశాయి. ఫ్రాన్స్ విద్యార్థుల పోరాటం, వియత్నం, కంపూచియాలో సాగిన విముక్తి పోరాటంలో విద్యార్థి కెరటాలు చేసిన సాహసాలు లాటిన్ అమెరికాలో ఎర్నెస్ట్ 'చేగువేరా' సాహసోపేత త్యాగం క్యాంపస్ విద్యార్థులపై ప్రభావం చూపాయి. ఆ పోరాటాల స్ఫూర్తితో త్యాగాల తెలుగునేల మీద, ఉస్మానియాలో జార్జిరెడ్డి పోరాట బాటను ఎంచుకున్నాడు. క్యాంపస్‌లో విద్యార్థులకు పెద్దన్నగా, కొండంత ధైర్యంగా ఉన్నాడు. ఆయనను మతోన్మాద గుండాలు 1972 ఏప్రిల్ 14న అతి కిరాతకంగా కత్తులతో హత్యచేశారు. జె.సి.ఎస్. ప్రసాద్ ఆ పోరాట వారసత్వాన్ని అందుకున్నాడు. పోరాట ప్రస్థానాన్ని సాగిం చాడు. ఆ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా మరింతగా నిర్మాణ రూపం తీసుకుని, ఇదే భావాలతో వున్న పీఎస్ఎఫ్, ఎస్.ఎఫ్. తదితర పేర్లతో వున్న సంస్థలన్నింటిని కలిపి 1974 అక్టోబర్ 12, 13 తేదీ లలో హైదరాబాద్‌లో మొదటి మహాసభ జరిపి పీడీఎస్‌యూ సంస్థను రాష్ట్రవ్యాపితం చేశారు.

### పీడీఎస్‌యూకి 50 ఏళ్లు

మొదటి మహాసభ జరిగి ఈ సంవత్సరం అక్టోబర్ 12,13 నాటికి 50 ఏండ్లు పూర్తవుతుంది. ఈ 50 ఏండ్లలో పీడీఎస్‌యూ రాష్ట్ర వ్యాపితంగా ఎన్నో పోరాటాలకు వేదిక అయింది. విద్యార్థుల సమస్యల నుంచి, అధిక ధరలు, రాజకీయ సమస్యల దాకా, ర్యాగింగ్ నుంచి మహిళలు, దళితులు, బలహీనవర్గాలపై జరిగే వివక్షల దాకా ఎన్నో పోరాటాలను స్వంతం చేసుకుని విజయాలు సాధించింది. జార్జి నుంచి ఆరంభించి ఈ 50-52 ఏండ్ల కాలంలో ఎన్నో మెదళ్ళకు చైతన్య బాటలు అందించింది. సామాజిక స్పృహను, ప్రజాస్వామిక విప్లవ చేవను అందిం చింది. 1975 ఎమర్జెన్సీలో నిషేధం ఎదుర్కొన్నది. జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరిని ఎన్‌కౌంటర్ పేరుతో చంపేసినా, చీకటి కాలంలో అజ్ఞాత సూర్యుడిలా వెలుగొందింది. ఎమర్జెన్సీ అనంతరం తిరిగి తెలుగు సీమలో పోరాట పరవళ్ళను సృష్టించింది. ఈ సంస్థ మొదటి సభ జరిగి 50 ఏండ్లు అయిన సందర్భంగా 2024 అక్టోబర్ 30 నాడు పీడీఎస్‌యూ 50 ఏండ్ల అనుభవాన్ని నెమరువేసుకుందాం. చరిత్ర మనకు అందించే అనుభవ పాఠాల నుంచి నేర్చుకుని, తగిన ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం వుంది. గత అనుభవాలను నెమరువేసుకొని భవిష్యత్ ఉద్యమ రూపకల్పన కోసం 2024 సెప్టెంబర్ 30న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే 50 వసంతాల సభలో పాలుపంచుకుందాం.

# వికసిత భారత్‌కి గట్టి పునాదులు



దేశంలో నిష్క్రియాతత్వ పాలన, అవినీతి, బంధుప్రీతి, సంతుష్టీకరణ రాజకీయాలకు విసుగు చెందిన భారత ప్రజలు 2014వ సంవత్సరంలో నరేంద్ర మోడీకి బలమైన మద్దతును ప్రకటించి దేశ ప్రధానిగా బాధ్యతలు అప్పగించారు. అప్పటినుండి ఆయన ప్రధానమంత్రిగా కాకుండా దేశ ప్రజలకు ప్రధాన సేవక్‌గా సేవలు అందిస్తూ సరైన సమయంలో వేగవంతమైన నిర్ణయాలతో పాటు సంస్కరణలతో కూడిన విధానపర నిర్ణయాలను తీసుకుంటూ 2047లో వికసిత భారతంగా భారతదేశాన్ని తీర్చిదిద్దడానికి శ్రమిస్తున్నారు. ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నరేంద్ర మోడీ నాయకత్వం పట్ల దేశ ప్రజలకే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రశంసలు దక్కాయి. మూడవ ఎన్నికల సమయంలోనే ఈ సారి అధికారంలోకి వస్తే తొలి వంద రోజులలో దేశ క్షేమం కోసం ఏమి చేయాలో అని చర్చించి నిర్ణ యం తీసుకున్న మోడీ ఆ దిశలోనే వేగంగా అడు గులు వేస్తున్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీతో పా టు దాని మిత్రపక్షాలు ప్రజలను తప్పుదారి పట్టి స్తూ అసంబద్ధ ప్రకటనలు, అసత్య ప్రచారాలు నెరవేర్చలేని హామీలు ఇచ్చినప్పటికీ దేశ సౌభా గ్యం కోసం సంక్షేమాన్ని సమ్మిళిత అభివృద్ధిని సరైన మేళవింపుతో ముందుకు తీసుకువెళుతున్నారు.

### ప్రతిపక్షాల వైఖరికి భిన్నంగా..

మోడీ దేశంలో మౌలిక వసతుల అభివృద్ధికి అగ్ర తాంబూలం ఇస్తున్నారు. 15 లక్షల కోట్ల రూపాయలతో దేశవ్యాప్తంగా మౌలిక వసతులు అభివృద్ధి చేయడానికి.. వివిధ పథకాల అమలు కోసం తొలి వంద రోజులలోనే ఆమోదం తెలపడం ఆ దిశగా పనులు ప్రారంభించడం ప్రశంసనీయం. దేశంలో ప్రధానమంత్రి ఆయు ష్మాన్ భారత్ ద్వారా ప్రతి భారతీయునికి ఆరోగ్య భద్రత కల్పిస్తూ వస్తున్న మోడీ ప్రభుత్వం ఇప్పుడు 70 సంవత్సరాలు పైబడిన సీనియర్ సిటిజన్స్‌కు కూడా 5 లక్షల రూపాయల వరకు ఈ పథకంలో ఉచిత వైద్యాన్ని అందిస్తూ నిర్ణయం తీసుకున్నది. ప్రతిపక్షాలు ప్రభుత్వ ఉద్యోగులను రాజకీయ ప్రయోజనాల కోసం, దేశ ఆర్థిక స్థితిగతులను పట్టించుకోకుండా దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రతి ఎన్నికల్లో ఇష్టారీతిగా హామీలు ఇస్తున్నాయి. ఆ వైఖరికి భిన్నంగా ఉద్యోగ సంఘాలతో సంబంధిత ప్రతినిధులతో చర్చించి ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ కు ఆమోదం తెలిపి అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని మరోసారి చూపెట్టింది. గత దశాబ్దకాలంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా నాలుగు కోట్ల ఇండ్లను నిర్మించిన మోడీ ప్రభుత్వం మూడవసారి అధికారం చేపట్టాక మరో మూడు కోట్ల ఇండ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నది. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా ప్రజలకు ఉచిత విద్యుత్ అందించడానికి సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం తొలి వంద రోజుల్లోనే 2.5 లక్షల ఇళ్లలో సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేసింది.

### మౌలిక వసతుల కల్పన కోసం..

దేశంలో నూతన ఆవిష్కరణల కోసం లక్ష కోట్ల రూపాయలతో పరిశోధన నిధిని ఏర్పాటు చేయడం, 8 జాతీయ హై స్పీడ్ రోడ్ కారిడార్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపడం, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా 65,000 కిలోమీటర్ల మేర రోడ్లు వంతెనల నిర్మాణానికి నిర్ణయం తీసుకోవడం, దేశవ్యాప్తంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లను పెంచడంతో పాటు 8 కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపడం, వ్యవసాయ రంగంలో కొత్త స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి అగ్రి సూర్ అనే కొత్త నిధిని ఏర్పాటు చేయడం, లడఖ్‌ను హిమాచల్‌ప్రదేశ్‌తో కలిపే షింఖున్-లా టన్నెల్ నిర్మాణంను ప్రారంభించడం, వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం, బీహార్‌లోని బిహ్తా, పశ్చిమ బెంగాల్ లోని బాగ్‌డోగ్రాలో కొత్త సివిల్ ఎన్‌క్లేవ్‌ల అభివృద్ధికి ఆమోదం తెలపడం, లక్షద్వీప్ దీవుల్లోని అగట్టి, మినీకాయ్‌లో కొత్త ఎయిర్‌స్ట్రిప్‌ల నిర్మాణానికి నిర్ణయం తీసుకోవడం గమనిస్తే.. మౌలిక వసతుల కల్పనలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎంత వేగంగా అడుగులు వేస్తుందో స్పష్టం అవుతుంది. వీటితోపాటు నారీ శక్తిని ప్రోత్సహించడానికి మూడు లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రణాళికలు రచించడం, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా మరో విడత పెట్టుబడి సహాయాన్ని రైతులకు అందించడం, రైతుల నుండి పంటల సేకరణ కోసం కనీస మద్దతు ధరను విస్తరించడం, అంతర్జాతీయ ఒత్తిడిలను తట్టుకొని రైతులకు ఎరువుల సబ్సిడీని అందించడంతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం ప్రోత్సాహకాలు విడుదల చేస్తూ ఉండడం నరేంద్ర మోడీ ప్రభుత్వం సర్వస్పర్శి విధానాలకు నిదర్శనం.

### తెలంగాణ అభివృద్ధి కోసం..

దేశవ్యాప్తంగా ఇలాంటి ఎన్నో అద్భుత నిర్ణయాలు తొలి వంద రోజులలోనే నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేయడంతో పాటు ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక నిర్ణయాలను అమలు చేస్తుంది. జహీరాబాద్‌లో 22,361 కోట్లతో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటును ప్రకటించింది. హైదరాబాద్ నుండి నాగపూర్ వరకు మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సౌకర్యాన్ని కల్పించడంతో తెలంగాణ నుండి మొత్తంగా వందే భారత్ సర్వీసులు 5కు పెరిగాయి. సమాఖ్య స్ఫూర్తిని గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వ వినతి మేరకు రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి అందించడంతో రాష్ట్రంలో ప్రజలకు కావలసిన సౌకర్యాల అభివృద్ధికి ఇది కీలక పరిణామంగా మారింది. రాష్ట్రంలో గత దశాబ్దకాలంగా రైల్వేస్టేషన్లో అభివృద్ధి, రైల్వే లైన్ల ఆధునీకరణ, వివిధీకరణ వేగంగా జరుగుతుంది. దీనిలో భాగంగానే 4109 కోట్లతో భద్రాచలం నుండి మల్కాజ్‌గిరి వరకు నూతన రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

### దేశ సంక్షేమమే లక్ష్యంగా..

దేశ అభివృద్ధితో పాటు అంతర్జాతీయ సంబంధాలను, అంతర్జాతీయ దౌత్యనీతిని నరేంద్ర మోడీ అత్యంత చాకచక్యంగా పాటిస్తున్నారు. భారత దేశాన్ని శత్రు దేశాలు కూడా పొగిడేలా... అంతర్జాతీయ విపత్తు సమయాలలో భారతదేశం కీలక పాత్ర పోషించేలా రష్యా- ఉక్రెయిన్ లాంటి భీకర యుద్ధ సమయంలో కూడా వారికి శాంతి మంత్రా న్ని బోధించే మహాశక్తిగా భారతదేశాన్ని తీర్చి దిద్దారు. ఐక్యరాజ్యసమితి సమావేశాల నుండి మొదలుకొని జీ7, జీ20 సమావేశాల వరకు ప్రతి సమావేశాలలో భారతదేశం ప్రతి అంశం పట్ల బలంగా తన వైఖరిని వెల్లబుచ్చడం మారిన భారత దౌత్య విధానాలకు నిదర్శనం. ప్రపంచంలో ఏ మూలన భారతీయుడు ఆపదలో ఉన్నా, వారిని సురక్షితంగా దేశంలోకి చేర్చే బాధ్యతను స్వీకరించిన మోడీ ప్రభుత్వం దాన్ని విజయవంతంగా అమలు చేయడంతో పాటు సమీప దేశాలలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను సునిశితంగా గమనిస్తూ భారతదేశ సంక్షేమం భద్రత లక్ష్యంగా పటిష్టమైన నిర్ణయాలను వేగంగా అమలు చేయడం ప్రభుత్వ దార్శనికతకు ప్రతీక. 2047వ సంవత్సరం వరకు వికసిత భారతం దిశలో ముందుకు సాగుతామని దేశ ప్రజలకు వాగ్దానం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ తొలి వంద రోజులలో తీసుకున్న నిర్ణయాలు చూస్తుంటే ఆ స్వప్నం చాలా వేగంగా సాకారం అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.


## 2030 నాటికి గణనీయంగా ఆమోదయోగ్యత సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల వంటి కొత్త ఇంధన వాహనాలపై (ఎన్ఈవీ) క్రమంగా ఆసక్తి పెరుగుతోంది. 2030 నాటికి వాటికి గణనీయంగా ఆమోదయోగ్యత పెరగనుందని ఒక సర్వే నివేదికలో వెల్లడైంది. అర్బన్ సైన్స్ సంస్థ తరఫున ది హ్యారిస్ పోల్ నిర్వహించిన ఈ సర్వే ప్రకారం అప్పటికి, పెట్రోల్/డీజిల్ వాహనాల ధరతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలపై 49 శాతం వరకు అధికంగా చెల్లించేందుకు కొనుగోలుదారులు సిద్ధంగా ఉంటారని తేలింది.




సర్వేలో పాల్గొన్న 1,000 మందిలో 83 శాతం మంది ఈ దశాబ్దం ఆఖరునాటికి ఎన్ఈవీని కొనుగోలు చేసే అంశం పరిశీలిస్తామని తెలిపారు. భారత్ సహా అమెరికా, ఆస్ట్రేలియా, చైనా, జర్మనీవ్యాప్తంగా ఈ సర్వే నిర్వహించారు. ఇందులో భారత్‌కి సంబంధించిన విశేషాలు చూస్తే.. ప్రధాన నగరాలు, వర్ధమాన ద్వితీయ శ్రేణి పట్టణాల్లో చెప్పుకోతగ్గ స్థాయిలో పబ్లిక్ ఈవీ చార్జింగ్ నెట్‌వర్క్ వేగవంతంగా విస్తరిస్తుండటంతో ఎన్ఈవీలపై భారత్‌లో సానుకూల అభిప్రాయం నెలకొంది. ప్రస్తుతం ప్రధాన నగరాలు, హైవేల వెంబడి 6,000 పైచిలుకు చార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉన్నాయి. 2027 నాటికి

# ఈవీలపై పెరుగుతున్న ఆసక్తి!



ఈ సంఖ్య ఒక లక్షకు పైగా పెరగనుంది. ఈవీ సెగ్మెంట్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రియాశీలక విధానాలు అమలు చేస్తుండటం కూడా ఎలక్ట్రిక్ వాహనాలపై సానుకూలతకు దోహదపడుతోంది. ఈ విభాగంలో చైనా స్థాయిలో భారత్ కూడా అధునాతన టెక్నాలజీ, ఉత్పత్తి సామర్థ్యాలను సాధించాలి. అవకాశాలు భారీగా ఉన్నప్పటికీ, చైనా ఆధిపత్యం కారణంగా భారత్‌లో ఈవీల తయారీకి సవాళ్లు ఉంటున్నాయి. ఈవీలకు కీలకమైన లిథియం అయాన్ బ్యాటరీలు .. ఎలక్ట్రిక్ మోటర్లను ఉత్పత్తి చేయడంలోనూ, చార్జింగ్ మౌలిక సదుపాయాల ఏర్పాటు విషయంలోనూ చైనా అధిపత్యం కనిపిస్తోంది. ఈ విభాగాల్లో నైపుణ్యాలు సాధించకుండా ముందుకెళ్లడంలో భారత్ కష్టపడాల్సి రావచ్చు. భారత్‌లో ఈవీ మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడంలో, ఎలక్ట్రిక్ కార్లను మరింత చౌకగా అందరికీ అందుబాటులోకి తేవడంలో చైనా కంపెనీలతో కలిసి పనిచేయడం కీలకంగా ఉండవచ్చు. చైనా అనుభవాల నుంచి నేర్చుకుని, భారత్ మరింత వేగంగా ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు మళ్లవచ్చు.

## ప్రయాణికులు ఎగిరి గంతేసే వార్త చెప్పిన కేంద్ర రైల్వే మంత్రి



**న్యూఢిల్లీ,:** అక్టోబరు మూడోతేదీ నుంచి దసరా శరన్నవరాత్రులు ప్రారంభం కాబోతున్నాయి. ఆ తర్వాత దీపావళి పర్వదినం ఉంది. పండగల సందర్భంగా పిల్లలకు సెలవులు, పెద్దలకు వర్క్ ఫ్రం హెూం ఉంటాయి. దీంతో సరదాగా సొంత ఊళ్లో గడుపుదామని బయలుదేరడానికి టికెట్లు బుక్ చేయాలనుకుంటే అన్నీ వెయిటింగ్ లిస్టు టికెట్లే కనిపిస్తున్నాయి. ఏం చేయాలో తెలియడంలేదు. బస్సుల్లో వెళదామంటే వాటికి భారీ ధర పెట్టి టికెట్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇటువంటి సందర్భంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ ప్రయాణికులకు తియ్యటివార్తను వినిపించారు.


### 5975 రైళ్లను నడుపుతున్న రైల్వే

ప్రయాణికుల ఇబ్బందులను అర్థం చేసుకున్న రైల్వే మంత్రి వారికోసం ప్రత్యేకంగా ఆరువేల రైళ్లను దేశవ్యాప్తంగా నడిపించబోతున్నట్లు ప్రకటించారు. దీపావళి, దసరా, ఛత్ పండగల కోసం దేశవ్యాప్తంగా రాకపోకలు ముమ్మరంగా సాగుతాయి. ప్రత్యేకంగా రైళ్లను నడిపించడంతోపాటు ఇప్పుడు నడుస్తున్న రైళ్లకు అదనపు బోగీలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇది కూడా మరో శుభవార్తే. గతేడాది ఇదే సమయానికి 4429 రైళ్లను నడపగా, ఈ ఏడాది 5975 రైళ్లను నడుపుతున్నట్లు మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న 108 రైళ్లకు జనరల్ బోగీల సంఖ్యను పెంచింది. కొత్తగా 12,500 బోగీలు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల కోట్ల మంది ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చని మంత్రి వ్యాఖ్యానించారు.

### కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తోంది

రెండు నెలల క్రితమే భారతీయ రైల్వే ఓ కీలక ప్రకటన చేసింది. పండగలతో సంబంధం లేకుండా సాధారణంగా దూరప్రాంతాలకు ప్రతిరోజు నడుస్తున్న రైళ్లల్లో జనరల్ బోగీలు సరిపోవడంలేదని, ఇందులో కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తోందని, చివరకు మరుగుదొడ్లలో కూడా నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తోందని, ఇటువంటి ఇక్కట్లను తప్పించాలని, అదనంగా జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలంటూ రైల్వేపై ఒత్తిడి వచ్చింది. దీంతో దూర ప్రాంతాలకు ప్రయాణించే అన్ని రైళ్లకు రెండు జనరల్ బోగీలను ఈ నెలాఖరు నుంచి ఏర్పాటు చేస్తున్నారు. అలాగే జోన్ల పరిధిలో, డివిజన్ల పరిధిలో తిరిగే రద్దీ రైళ్లకు కూడా వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

## మన్‌కీ బాత్ 114వ ఎపిసోడ్.. ఇది చాలా ప్రత్యేకమన్న ప్రధాని



ఇంటర్నెట్ డెస్క్: మనసులో మాట పేరుతో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమం 114వ ఎసిపోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజల ప్రయత్నాలు, స్ఫూర్తిదాయకమైన కథనాలను మన్‌కీబాత్ చూపిస్తోందన్నారు. కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు పూర్తిచేసుకోనున్న నేపథ్యంలో ఈ ఎపిసోడ్ తనకు భావోద్వేగమైనదని అన్నారు. సామూహిక శక్తిని ప్రదర్శించే ప్రత్యేక వేదికగా ఈ కార్యక్రమం మారిందన్నారు. మన్‌కీ బాత్ ద్వారా తన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియాకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా మసాలాలేని కంటెంట్‌ను ప్రజలు పట్టించుకోరనే అభిప్రాయం ఉండేదని.. ఈ కార్యక్రమం ఆ అభిప్రాయాన్ని మార్చేసిందన్నారు. స్ఫూర్తిమంతమైన కథలు, ప్రేరణ పొందే వ్యక్తులకు సంబంధించిన విషయాలు తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. నీటి నిర్వహణ గురించి ప్రస్తావించిన ఆయన.. నీటి సంరక్షణ ఎంత కీలకమో వర్షాకాలం సూచిస్తుందని చెప్పారు. నీటి సంరక్షణకు అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. 20 వేల భాషలకు భారత్ పుట్టినిల్లు అని పేర్కొన్న మోదీ.. దేశంలో వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. 'తల్లి పేరిట మొక్క' కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమం పేరిట గుజరాత్‌లో 15 కోట్లకు పైగా, యూపీలో 26 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు తెలిపారు. క్రియేట్ ఇన్ ఇండియాలో భాగస్వామ్యం కావాలని నూతన ఉత్పత్తుల తయారీదారులకు మోదీ పిలుపునిచ్చారు. భారత్ ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న 'మేకిన్ ఇండియా' కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు పూర్తయిందని ప్రధాని అన్నారు. దీంతో ప్రతి రంగంలోనూ ఎగుమతులు పెరిగాయని, విదేశీ సంస్థాగత మదుపరులను ఆకర్షించడంలో ప్రభుత్వం పురోగతి సాధించిందన్నారు. ఈ కార్యక్రమం స్థానిక తయారీదారులకు సాయపడిందన్నారు. రానున్న పండుగ సీజన్‌లో స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రజలకు పిలుపిచ్చారు. ఇదిలా ఉండగా.. 2014 అక్టోబర్ 3న తొలిసారి 'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

## భారత్ నిర్ణయంతో ఊపిరి పీల్చుకున్న ప్రపంచ దేశాలు!



**న్యూఢిల్లీ,:** బియ్యం ఎగుమతులపై విధించిన చాలా పరిమితులను భారత్ తొలగించింది. 2023లో ఈ ఆంక్షలు విధించారు. రుతుపవనాలు బాగా ఉండడం, ప్రభుత్వ గోదాముల్లో సరిపడా బియ్యం నిల్వ ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఎగుమతిదారు. 2022లో, భారతదేశం ప్రపంచంలోని బియ్యంలో 40% కంటే ఎక్కువ ఎగుమతి చేసింది. మొత్తం 5.54 కోట్ల టన్నులలో ఇది 2.22 కోట్ల టన్నులు. భారతదేశం 140 కంటే ఎక్కువ దేశాలకు బియ్యం ఎగుమతి చేస్తుంది. భారత ప్రభుత్వం ఇతర దేశాలకు వారి ఆహార భద్రత అవసరాలను తీర్చడానికి మరియు వారి ప్రభుత్వాల అభ్యర్థనల ఆధారంగా ఎగుమతులను అనుమతించింది. బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతిపై నిషేధాన్ని శనివారం ప్రభుత్వం ఎత్తివేసింది. అలాగే, దానిపై టన్నుకు 490 కనీస ధర నిర్ణయించబడింది. దీనికి ఎగుమతి సుంకం నుంచి కూడా మినహాయింపు ఇచ్చారు. దేశీయ సరఫరాను పెంచడానికి జూలై 20, 2023 నుంచి బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతి నిషేధించబడింది.

### ప్రపంచంలో అతిపెద్ద ఎగుమతిదారు

ప్రపంచంలోని తదుపరి నాలుగు అతిపెద్ద ఎగుమతిదారుల ఉమ్మడి ఎగుమతుల కంటే భారతదేశ ఎగుమతులు ఎక్కువగా ఉన్నాయి. వీటిలో థాయిలాండ్, వియత్నాం, పాకిస్థాన్ మరియు అమెరికా ఉన్నాయి. బెనిన్, బంగ్లాదేశ్, అంగోలా, కామెరూన్, జిబౌటి, గినియా, ఐవరీ కోస్ట్, కెన్యా, నేపాల్ భారతదేశం నుంచి బాస్మతీయేతర బియ్యాన్ని కొనుగోలు చేసే ప్రధాన దేశాలు. ఇరాన్, ఇరాక్, సౌదీ అరేబియా ప్రధానంగా బాస్మతి బియ్యాన్ని భారతదేశం నుంచి కొనుగోలు చేస్తాయి. విధించిన ఆంక్షల కారణంగా 2023లో భారతదేశ బియ్యం ఎగుమతులు 20% తగ్గి 17.8 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. 2024 మొదటి ఏడు నెలల్లో కూడా, ఎగుమతులు గత సంవత్సరం కంటే నాలుగింట ఒక వంతు తక్కువగా ఉన్నాయి.

### ఈ దేశాలపై ఆధారపడటం పెరిగింది

భారతదేశం యొక్క ఎగుమతులు తగ్గిన కారణంగా.. ఆసియా, ఆఫ్రికన్ కొనుగోలుదారులు థాయిలాండ్, వియత్నాం, పాకిస్థాన్, మయన్మార్ నుంచి బియ్యాన్ని కొనుగోలు చేయవలసి వచ్చింది. పెరిగిన డిమాండ్, పరిమిత సరఫరా కారణంగా.. ఈ దేశాలలో ఎగుమతి ధరలు గత 15 సంవత్సరాలలో అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. బాస్మతి కాకుండా తెల్ల బియ్యం (సెమీ మిల్లింగ్ లేదా పూర్తిగా మిల్లింగ్ చేసిన బియ్యం, పాలిష్ చేసినా, చేయకపోయినా) ఎగుమతి విధానాన్ని పరిమితం నుంచి ఉచితంగా సవరించినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి) శనివారం తెలిపింది. ఇది తక్షణం అమలులో ఉంటుంది.

# హృదయ ఆరోగ్యానికి ఐదు జాగ్రత్తలు



గుండె జబ్బు.. ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న ఆరోగ్య ఆరోగ్య సమస్య. ఇది అన్ని వయసుల వారినీ చుట్టుముడుతోంది. ఇటీవలికాలంలో యువతలోనూ ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. జీవనశైలిలో మార్పుల కారణంగా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గుండె జబ్బులపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఒక వైద్య అధ్యయనంలోని వివరాల ప్రకారం కుటుంబ చరిత్ర, సరైన ఆహారం తీసుకోకపోవడం, ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవడం, మద్యపానం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ మొదలైనవన్నీ హృదయ ఆరోగ్య సమస్యలకు కారణంగా నిలుస్తుంటాయి. అయితే హృదయం ఆరోగ్యంగా ఉండాలంటే ఐదు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### మద్యం, ధూమపానానికి దూరం

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే మద్యం, ధూమపానానికి దూరంగా ఉండటం చాలా అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. ధూమపానం అనేది ధమనుల పనితీరును దెబ్బతీసుస్తుంది. ఫలితంగా గుండె జబ్బుల ప్రమాదం చాలా వరకు పెరుగుతుంది. మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరం. మద్యపానం రక్తపోటును పెంచుతుంది. గుండె పనితీరుకు అంతరాయం కలిగిస్తుంది. దీర్ఘకాలిక గుండె జబ్బుల ముప్పును గణనీయంగా పెంచుతుంది.

### అలసటపై నిర్లక్ష్యం వద్దు

గుండెకు సంబంధించి ఏ చిన్న సమస్య వచ్చినా ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఛాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో సమస్యలు మొదలైనవి తీవ్రమైన గుండె సమస్యలకు సూచన కావచ్చు. ఇటువంటి సమయంలో వెంటనే చికిత్స తీసుకోవాలి. హృదయ స్పందన రేటు పెరగడం, విపరీతంగా అలసిపోయినట్లు అనిపించడం హృదయ ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు సూచిస్తున్నారు.

### నిద్రలేమిని విస్మరించొద్దు

నిద్రలేమి సమస్య ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. గుండె ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. ఆరోగ్యకరమైన దినచర్యలో నిద్ర ఒక ముఖ్యమైన భాగం. ప్రతి రోజూ రాత్రి కనీసం 6 నుంచి 8 గంటల నిద్ర అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. నాణ్యమైన నిద్రకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, హృదయ సంబంధ సమస్యలను నివారించవచ్చు. చక్కని నిద్ర పలు వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తుంది.

### ఒత్తిడిని జయించండి

అధిక ఒత్తిడి ఆరోగ్యానికి ప్రమాదకరం. దీర్ఘకాలిక ఒత్తిడి గుండెను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని వైద్యులు చెబుతుంటారు. ఒత్తిడి కారణంగా కార్టిసాల్ హార్మోన్ స్థాయి గణనీయంగా పెరుగుతుంది. ఇది రక్తపోటును, కొలెస్ట్రాల్‌ను మరింతగా పెంచుతుంది. అందుకే ఒత్తిడికి దూరంగా ఉండే ప్రయత్నం చేయండి.

### వ్యాయామం తప్పనిసరి

ఫిట్‌నెస్‌పై శ్రద్ధ చూపడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతగానో సహాయపడుతుంది. ఇందుకోసం ప్రతీ రోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. నడక, జాగింగ్, సైక్లింగ్ లేదా స్విమ్మింగ్ వంటివి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. వ్యాయామం చేసే అలవాటు శరీర బరువును తగ్గించడంలో, కొలెస్ట్రాల్, రక్తపోటు స్థాయిలను నియంత్రించడంలో ఎంతగానో ఉపయోగపడుతుంది.

# ఉద్యోగాల్లో పనిఒత్తిళ్లే ఉరితాళ్లా!



పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులు తాము ఉత్తీర్ణులవుతామో లేదో అన్న టెన్షన్‌తో ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలకు రాజస్థాన్‌లోని కోట కోచింగ్ సెంటర్లు సంచలనం కలిగించాయి. అలాగే ఉద్యోగం రాక మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న నిరుద్యోగుల హృదయ విదారక గాథలు కూడా దేశంలో జరుగుతున్నాయి. అయితే ఉద్యోగంలో కొన్ని లక్షల వేతనాలు పొందుతున్నా, ప్రోత్సాహకాలు అందుకుంటున్నా పని ఒత్తిడికి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న కార్పొరేట్ ఉద్యోగుల విషాద గాథలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. కార్పొరేట్ ఉద్యోగాలు.. లక్షల్లో జీతాలు.. ఆహా! జీవితాలకు ఏం ఢోకా లేదు. బోలెడు సంపాదన ఈ విధంగా మురిసిపోతుండటం సహజం. కానీ ఆ ఉద్యోగాలు చేస్తున్నవారు తమ ప్రాజెక్టుల లక్ష్యాలను నెరవేర్చడంలో క్షణం తీరిక లేక ఎంత మానసిక ఒత్తిడికి గురవుతున్నారో, చివరకు ఆత్మహత్యలకు కూడా పాల్పడేందుకు ఏ విధంగా తెగిస్తున్నారో తెలిస్తే తీరని ఆవేదన కలగకమానదు. 2021 లో నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈ కార్పొరేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు పని ప్రదేశంలో ఒత్తిడి కారణంగా దేశం మొత్తం మీద ప్రతివారం కనీసం 50 మంది వరకు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని వెల్లడైంది. ఈ విధంగా 2021లో దేశంలో మొత్తం 1,64,033 మంది ఆత్మహత్య చేసుకున్నారని బయటపడింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఈ మరణాల రేటు 7.2% అధికమని చెప్పవచ్చు. కానీ వాస్తవానికి ఈ మరణాల శాతం ఇంకా ఎక్కువ ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఉద్యోగులు ఎందుకు ఈ తెగింపునకు పాల్పడుతున్నారో ఆయా సంస్థలు ఇప్పటికీ అర్థం చేసుకోవడం లేదు. ప్రాజెక్టుల పేరుతో నిర్ణీత గడువు విధిస్తూ ఒత్తిడి పెంచుతుండటమే ఇలా జరుగుతున్నాయని, అందుకనే పని ప్రదేశంలో ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొనేలా ప్రయత్నించాలన్న ఆలోచన కార్పొరేట్ సంస్థలకు తట్టకపోవడం అత్యంత శోచనీయం. ప్రభుత్వాలు తగిన ఉద్యోగాలు కల్పించలేకపోవడంతో నిరుద్యోగ యువత నగరాల్లో కార్పొరేట్ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. యువతకు ఇన్ని లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం, వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పిస్తాం అని ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు మేడిపండు చందంగా ఉంటున్నాయి తప్ప వాస్తవానికి క్షేత్రస్థాయిలో అవి ఆచరణకు నోచుకోవడం లేదు. ఈ పరిస్థితుల్లో లక్షల్లో తమకు వేతనాలు అందుతాయన్న ఆశతో బహుళ జాతి సంస్థలను ఆశ్రయించడం యువతకు తప్పనిసరి అవుతోంది. యువతకు అందమైన రంగుల హరివిల్లులో ఆకర్షిస్తున్న నగరాలే ఇప్పుడు యువతకు ఉరితాళ్లు బిగిస్తున్నాయని 2022లో 'బిజినెస్ ఇన్‌సైడర్' అనే వెబ్‌సైట్ వెల్లడించింది. దేశం లోని 53 నగరాల్లో నమోదైన మొత్తం ఆత్మహత్యల్లో నాలుగు ప్రధాన నగరాలైన ఢిల్లీ (2760), చెన్నై (2699), బెంగళూరు (2292), ముంబై (1436)లోనే 35.5 శాతం జరిగాయని ఆ వెబ్‌సైట్ విశ్లేషించడం గమనార్హం. కొన్ని ఉదాహరణలను ఈ సందర్భంగా పరిశీలిద్దాం. 2022 జనవరిలో 31 సంవత్సరాల ఐటి ఉద్యోగి పనిఒత్తిడిని తట్టుకోలేకపోతున్నానంటూ తన కుటుంబ సభ్యులకు పదేపదే చెబుతుండడమే కాక, హైదరాబాద్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదే సంవత్సరం సెప్టెంబరులో గురుగ్రామ్‌లో 39 సంవత్సరాల అసిస్టెంట్ మేనేజర్ తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారంటూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 2021 లో హైదరాబాద్‌లోని టిసిఎస్‌లో పని చేస్తున్న యువకుడు పని ఒత్తిడి వల్లనే చనిపోయాడు. 2019లో 24 సంవత్సరాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన యువతి తాను పనిచేస్తున్న సంస్థ ఉద్యోగం నుంచి తొలగించడంతో హైదరాబాద్ రాయదుర్గంలోని ఓ హెూటల్‌లో బలవన్మరణానికి బలైపోయింది. అదే సంవత్సరం 23 ఏళ్ల యువకుడు హైదరాబాద్‌లోని ఓ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. దీర్ఘకాల పని గంటలు, కష్టతరమైన డెడ్‌లైన్లు, అధిక పనిభారం ఇవన్నీ ఉద్యోగులపై విపరీతమైన ఒత్తిడికి దారితీస్తున్నాయి. కొందరు ఐటి ఉద్యోగులు వారాంతపు సెలవు రోజుల్లో కూడా తమతోపాటు లాప్‌టాప్ తీసుకెళ్లి ఇంటి దగ్గర పని చేయవలసిన పరిస్థితులు కూడా ఉంటున్నాయి. పని ప్రదేశంలో ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించేలా చూడాలని, వారి మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా ఆయా సంస్థలు తమ మేనేజర్లకు శిక్షణ ఇవ్వాలని సూచనలు అందుతున్నా వాటిని క్రియారూపం లో పాటించే పరిస్థితి కనిపించడం లేదు. కర్ణాటకలో ఇటీవల ఐటి కంపెనీలు ఉద్యోగులకు 14 నుంచి 18 గంటల వరకు పనివేళలు పెంచడం ఐటి రంగంలో కల్లోలం రేగిన సంగతి తెలిసిందే. దీనికి తోడు ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి ఉద్యోగులు నిర్విరామంగా 18 గంటలు పని చేస్తేనే ఉత్పత్తి అధికంగా సాధించగలమని హితోక్తులు పలికిన సంగతి తెలిసిందే.

# కులగణనతోనే బిసిల భవిష్యత్!



విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బిసిలు ముందు నుండి అనేక వివక్షలకు గురవుతున్నారు. వీరి ఎదుగుదలకు కులగణన ఒక గొప్పఅవకాశం. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో అధికారంలోకి రాగానే 100 రోజుల్లో 23 నుంచి 42 శాతానికి ఒబిసి రిజర్వేషన్లను పెంచుతామని హామీ ఇచ్చింది. దాన్ని పరిగణనలోకి తీసుకొని తెలంగాణలో కులగణన చేయాలని మంత్రివర్గం ఆమోదం కూడా తెలిపింది. 2018లో బిసి కులగణనను చేస్తామని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నటువంటి కులగణనను ప్రభుత్వం మార్చి 15వ తేదీన జిఒ నెంబర్ 26ను 2024 ద్వారా మొత్తం తెలంగాణ ప్రజల జీవన స్థితిగతులు, వృత్తి, విద్య, ఉపాధి, ఉద్యోగావకాశాలు, కుటుంబ పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు ఇలా మొదలైనటువంటి వివరాలను సేకరించాలని, అటువంటి ఉద్దేశంతో ఈ కులగణన చేయాలని నిశ్చయించుకున్నారు. 1931 తర్వాత కులగణన జరగకపోవడం వల్ల చాలా కులాలకు సంక్షేమ ఫలాలు అందక అభివృద్ధిలో కూడా వెనుకబడిపోయారు. ఈ సంపూర్ణ కులగణన ద్వారా వారి స్థితిగతులు ఎలా ఉన్నాయో తెలవడంతోపాటు, వారికి ఏం చేయాలో అనేటువంటి విషయం కూడా తెలుస్తుందని ప్రభుత్వం యోచిస్తుంది. సంపూర్ణ కుటుంబ సర్వే వల్ల జనాభా ప్రాతిపదికన బడ్జెట్, నిధులు, రిజర్వేషన్లు పెంచడం వీలవుతుంది. గతంలో తమిళనాడులో 1982లో అంబాకర్ కమిషన్ నూరు శాతం జనాభా, కులగణన, కుటుంబ సర్వే చేయడం వల్ల 69% రిజర్వేషన్లకు ఆధారమైంది. 2016లో కర్ణాటకలో ఇలాంటి సంపూర్ణ సర్వే నిర్వహించడం జరిగింది. నిజానికి కులగణన డిమాండ్ 1950 నుంచి ఉన్నది. బ్రిటిష్ పాలనలో 1881 నుంచి 1931 వరకు ప్రతి పదేండ్లకు ఒకసారి జరిగే జనాభా గణనలో కులాలవారీగా జనాభా లెక్కలు సేకరించారు. నిజాం రాష్ట్రంలో కూడా సెన్సస్‌తో పాటు కులగణన జరిగింది కానీ 1951 సెన్సెస్‌లో అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఒబిసిల కులగణనను సమ్మతించకపోవడం వల్ల అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ డిమాండ్ కొనసాగుతూ ఉంది. ఈ మధ్య జాతీయ ప్రాధాన్యత అంశంగా మారింది. లెక్కల ప్రకారం విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్‌సిలకు 1947 నుంచి, ఎస్‌టిలకు 1950 నుంచి రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. ఒబిసిలకు సంబంధించి సుప్రీం కోర్టు తీర్పు బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్ తీర్పు 1962 ప్రకారం రిజర్వేషన్లు 50% మించకుండా మండల కమిషన్ నివేదిక ప్రకారం ఉద్యోగాలలో 27% 1993 నుంచి, కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో 93వ రాజ్యాంగ సవరణ ద్వారా 2006 నుంచి కల్పిస్తున్నారు. బిసిలను రాజకీయ పార్టీలు ఎప్పటికీ కార్యకర్తల్లాగానే చూస్తున్నాయి. వారికి ఉన్నత పదవులను కట్టబెట్టడం లేదు. ఓట్ల కోసం మాత్రమే వారిని వాడుకుంటున్నారు. బిసిలపై ప్రేమ చూపినట్టు నటించి, హామీలిచ్చి అధికారంలోకి రాగానే బిసిలను పట్టించుకోవడం లేదు. అందుకే బిసి నాయకులు ఉన్నతమైన రాజకీయ పదవులలో కనిపించడం లేదు. అందుకోసం బిసిలంతా ఐక్యంగా పోరాడవలసిన సమయం



ఆసన్నమైంది. స్థానిక సంస్థల ఎన్నికలతో ఈ కులగణనకు ప్రత్యక్ష సంబంధం ఉంది. దీని ద్వారా రాజకీయ ముఖచిత్రమే మారిపోయే అవకాశం ఉంది. పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు ఉన్నాయి. వాటిని ఎవరూ కూడా మార్చలేరు. కానీ బిసిలకు స్థానిక సంస్థల్లోనే తప్ప, పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో రిజర్వేషన్లు లేవు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు రిజర్వేషన్లను ప్రభుత్వాలు మార్చడం, చాలా మంది కోర్టుకు వెళ్లడం, రిజర్వేషన్లు ఇవ్వడానికి ఆధారమైనటువంటి కులజనాభా లెక్కలు అడగడం గత ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నటువంటి విషయం. గతంలో 1986లో ఎన్‌టి రామారావు ప్రభుత్వం హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్లు ప్రారంభమయ్యాయని చెప్పవచ్చు. అప్పుడు 20%గా ఉండేది. తర్వాత కోట్ల విజయభాస్కర్ రెడ్డి హయాంలో 34 శాతానికి పెరగగా, 2019లో సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా కెసిఆర్ ప్రభుత్వం దాన్ని 22 శాతానికి తగ్గించింది. ఇప్పుడు ఉన్నటువంటి పరిస్థితుల్లో బిసి కులాల జనాభా వివరాలు సేకరిస్తే ఆ తర్వాత చట్టసభల్లో కూడా తమ సీట్ల సంఖ్య పెరగాలని, రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్ వస్తుందనేటువంటి నేపథ్యంలో పాలక వర్గాలకు చెందిన అగ్రనేతలు కొంత అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు బిసి కులాల జనాభా వివరాలను శాస్త్రీయంగా సేకరించాలి. చేపట్టబోయే ఈ సర్వే కేంద్ర ప్రభుత్వంతో పాటు, కేంద్ర ఎన్నికల సంఘం కూడా వీటిని గుర్తించేలా ఉండాలి. ఈ కులాల జనాభా వివరాలను సేకరించే ముందు వారికి ఒక అవగాహన అనేటువంటిది అవసరం. దేశ జనాభాలో 56% గా ఉన్న బిసిలకు రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఇటు అసెంబ్లీ లోను, అటు పార్లమెంట్‌లోను ఎక్కువ సంఖ్యలో బిసిలు నష్టపోతున్నారు. బిసి నాయకులు ఉన్నత పదవుల్లో కనిపించడం లేదు. పార్లమెంట్‌లో 15% కూడా బిసిల బలంలేదు. దేశంలో 16 రాష్ట్రాల నుంచి ఒక్క బిసి ఎంపి కూడా లేరు. రిజర్వేషన్‌లు లేకపోవడం వల్ల ఆర్థికంగా ఉన్నటువంటి వారు మాత్రమే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. తరతరాలుగా బీసీలకు అన్యాయం జరుగుతుంది. వారిని ఇప్పటికే ఎన్నో పార్టీలు మోసం చేశాయి. దేశంలో అధిక సంఖ్యలో ఉన్నటువంటి బిసిలకు 23% రిజర్వేషన్లు కూడా లేవు. బిసి బిల్లు కోసం ఉద్యమిస్తున్న వారిని ఎన్‌డిఎ ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జనగణలోనైనా బిసి జనగణన చేపట్టాలి. తెలంగాణలో వేగంగా కులగణన కార్యక్రమాన్ని చేపట్టాలి. ఇటీవల బీహార్‌లో ఐదు వారాల్లోనే కులగణన చేశారనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్టు బోధించు, సమీకరించు, పోరాడు అనేటువంటి మాటలను బిసిలు ఆదర్శంగా తీసుకొని ఒక ఉద్యమాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది.

## ధరణి సమస్యలు పరిష్కరిస్తాం.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..



**హైదరాబాద్, :** రైతుల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్ జిల్లా షామీర్ పేటలోని నల్సార్ యూనివర్శిటీలో తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం రూపొందించిన ధరణితో అన్నదాతలు చాలా ఇబ్బందులు పడ్డారని మంత్రి గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు సమస్యలను పరిష్కరిస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి బాధలు లేకుండా చూసుకుంటామని పేర్కొన్నారు. తహశీల్దార్లకు గ్రామీణ ప్రజలకు ఎలా సర్వీస్ చేయాలో తెలుసని.. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తహశీల్దార్ ఆఫీస్ లో ఎలాంటి వసతులు లేకుండా ఉండేవని గుర్తు చేశారు. తహశీల్దార్లకు సంబంధించి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని పొంగులేటి హామీ ఇచ్చారు. అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పేదవారిని ఇబ్బంది పెట్టకుండా.. వారికి కావల్సిన పని చేస్తే అధికారులతో పాటు ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందని వివరించారు. అయితే కొంత మంది అధికారుల వల్ల వ్యవస్థకే బ్యాడ్ నేమ్ వస్తుందన్నారు. జిల్లా పాలనాధికారి అనుమతి లేకుండా తహశీల్దార్ పై కేసు పెట్టకుండా ఆదేశిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న తహశీల్దార్లలో 90 శాతం మంది రైతు కుటుంబం నుంచే వచ్చారని.. వారికి అన్నదాతల బాధ తెలుసని.. అందుకే వారు ఎలాంటి లాభాపేక్ష లేకుండా రైతులకు పని చేయాలని సూచించారు. కాగా అక్టోబర్ లో కొత్త రేషన్ కార్డులు ఇస్తామని మంత్రి ఇదివరకే ప్రకటించారు. త్వరలో దరఖాస్తులు స్వీకరించి కొత్త రేషన్ కార్డులు జారీ చేసే అవకాశం ఉంది. కాగా రాష్ట్రంలో చాలా మంది కొంత రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో ప్రజా పాలనలో దరఖాస్తులు తీసుకున్నారు. అయితే ఇప్పుడు ఆ దరఖాస్తులు ఎక్కడున్నాయి. వాటిని ప్రాసెస్ చేశారా అనేది తెలియలేదు. మరోవైపు రైతు రుణ మాఫీ కూడా అందరికి కాలేదు. దీంతో రైతులు కూడా రుణ మాఫీ పూర్తి చేయాలని కోరుతున్నారు.

## మూసీ నిర్వాసితులకు న్యాయం చేస్తాం



హైదరాబాద్: మూసీ నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పేదల సొంతింటి కల నెరవేర్చుతామని అన్నారు. సొంతిల్లు లేనివారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేదవారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు మాటిచ్చారు. అందరినీ కాపాడుకునే బాధ్యత తమదని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌ను వరల్డ్ బెస్ట్ సిటీగా మారుస్తామని అన్నారు. పీపీపీ కింద మూసీ ప్రాజెక్ట్ చేపడతామని ప్రకటించారు. మూసీలోకి గోదావరి నీళ్లు తీసుకువస్తామని అన్నారు. మూసీపై లింక్ రోడ్లు నిర్మిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. మూసీ ప్రక్షాళనపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసింది? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు మొసలికన్నీరు కారుస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. మల్లన్న సాగర్ నిర్వాసితులకు బీఆర్ఎస్ ఏం చేసింది అని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. గతంలో తాము మల్లన్నసాగర్ దగ్గరకు వెళ్తే అడ్డుకున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ధ్వజమెత్తారు. పోలీసులతో తమను అరెస్టు చేశారని శ్రీధర్‌బాబు గుర్తుచేశారు. ఇప్పుడు తాము బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్నామా అని మంత్రి శ్రీధర్‌బాబు నిలదీశారు. కొంతమంది అవకాశవాదులు రెచ్చగొట్టే పనిలో ఉన్నారని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. ఎఫ్‌టీఎల్ పరిధిని దాచిపెట్టి విక్రయాలు చేసిన బిల్డర్లపై చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు హెచ్చరించారు. మూసీని పరిరక్షించుకోవాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని.. అందుకోసం చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

## రూ. లక్షా 50 వేల కోట్లతో పెద్ద స్కెచ్ రేవంత్ సర్కారుపై ఈటల రాజేందర్ సంచలనం



తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్. రూ. లక్షా 50 వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేస్తామని.. పెద్ద స్కెచ్ వేసుకుని రంగంలోకి దిగారని ఆరోపించారు. మిషన్ భగీరథ, కాళేశ్వరం లాంటివి అయిపోయాక ఇక డబ్బులు ఎక్కడ ఉన్నాయని ఆలోచన చేసి.. మూసీ ప్రక్షాళనను తెరమీదకు తీసుకొచ్చారన్నారు. లక్షా 50 వేల కోట్ల రూపాయలతో మూసీ ప్రక్షాళన చేస్తామని అంటున్నారు.. పెద్ద స్కెచ్ వేసుకుని రంగంలోకి దిగారని రేవంత్ రెడ్డి సర్కారుపై ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో చెరువులు మురికి నిలయాలుగా ఉన్నాయని.. వాటి పక్కకు ఉండటం ఒక శాపమైనా.. దిక్కులేక ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే పదవి చక్కగా చేయలేదు.. ఎంపీగా గెలిపిస్తే మల్కాజిగిరిని పట్టించుకోలేదని మండిపడ్డారు ఈటల రాజేందర్. ఒక మంత్రిగా చేసిన అనుభవం కూడా లేదని.. చెరువులంటే అవగాహన లేదని అన్నారు. ఫార్మాసిటీ కోసం 13 వేల ఎకరాల భూములు సేకరించారు. రింగ్ రోడ్డు కోసం ప్రాజెక్టుల కోసం భూమిని సేకరిస్తున్నారు. అలాగే చెరువులను కాపాడేందుకు కూడా పట్టా భూములను సేకరించి, వారికి ప్రత్యామ్నాయం చూపించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. అవేమీ లేకుండా కట్టుకున్న ఇళ్లను కూలగొడతా అంటే న్యాయం అవుతుందా? అని ఈటల ప్రశ్నించారు. బిల్డర్లకు వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్న అని కొంతమంది అంటున్నారని మండిపడ్డారు. తన 25 ఏళ్ల రాజకీయ జీవితం కొట్లాటనే అని.. అది కూడా పేదల కోసమేనని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి.. చివరకు కేసీఆర్‌తో కూడా కొట్లాడనని ఈటల తెలిపారు. పేదల కోసం ముఖ్యమంత్రులతో కొట్లాడిన కమిట్‌మెంట్ తనదని చెప్పారు. రేవంత్ రెడ్డిని గెలిపించింది ప్రజలకు బాగు చేస్తారని కానీ.. ఏడిపిస్తారని కాదన్నారు ఈటల రాజేందర్. ప్రజల కన్నీళ్లు చూసి నవ్వుతున్న రేవంత్ రెడ్డి ఒక సైకో.. శాడిస్ట్ మెంటాలిటీ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను తిరగని చెరువు లేదు.. పలకరించని బాధితుడు లేడన్నారు. ఇంకా పిచ్చి పని ఈ ముఖ్యమంత్రి చేస్తాడని అనుకోవడం లేదన్నారు. జ్ఞానోదయమై సమీక్ష చేసి దీనికో పరిష్కారం చెప్పే ప్రయత్నం చేయాలే తప్ప మీ తాత జాగీర్ లాగా వేధిస్తే చూస్తూ ఊరుకోబోమని ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'నిన్ను (రేవంత్ రెడ్డి) ముఖ్యమంత్రి ఎందుకు చేసామా అని నీకు మద్దతు ఇచ్చిన వారందరూ బాధపడుతున్నారు. పట్టా భూముల్లో ఎవరైనా చెయ్యి పెడితే ఖబర్దార్ అని హెచ్చరిస్తున్నాను. పర్మిషన్లు ఇచ్చిన నాటి ముఖ్యమంత్రిగా తప్పు చేశారని ముక్కు నేలకు రాశాక ఇల్లు కూలగొట్టు. అనేకమంది సీఎంలను చూశాము నిన్ను కూడా చూస్తున్నాము. మంచి పనులు చేస్తే గుండెలో పెట్టుకుంటారు. ఇలాంటి పిచ్చి పనులు చేస్తే బండకేసి కొడతారు' అని ఈటల రాజేందర్ హెచ్చరించారు. ఎంపీ ఎన్నికల్లో తాను వచ్చే సమయం లేక రాకపోయినా.. తనకు సంపూర్ణ మద్దతిచ్చి గెలిపించినందుకు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు ఈటల రాజేందర్. మల్కాజిగిరి ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా అని అన్నారు. టెక్నికల్ గా గెలిచింది ఈటల రాజేందర్ కావచ్చు.. కానీ, గెలిచింది మల్కాజిగిరి ప్రజలేనని అన్నారు. పీర్జాదిగూడలో మంచినీటి సమస్యలు డ్రైనేజీ సమస్యలు పరిష్కరించేందుకు తన వంత ప్రయత్నం చేస్తానని తెలిపారు. పీర్జాదిగూడలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

# ఇది జాతీయ, ప్రాంతీయ సంఘర్షణ




జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల మూడు దశల పోలింగ్‌లో మొదటి రెండు దశల పోలింగ్ పూర్తయింది. ఈ సందర్భం గా జాతీయ, ప్రాంతీయ పార్టీల మధ్యనే కాకుండా జాతీయ పార్టీలైన బిజెపి, కాంగ్రెస్ మధ్య గట్టి సంఘర్షణ ఏర్పడింది. పదేళ్ల తరువాత, అలాగే 2019లో రాష్ట్ర, ప్రత్యేక హోదా పోయిన తరువాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవే. రెండో దశలో 57% వరకు పోలింగ్ జరిగినా, పోలింగ్ శాతాల్లో ప్రాంతాల వారీ తేడాలు బాగా కనిపించాయి. రియాసీ జిల్లాలో 74.7% పోలింగ్ ఉండగా, శ్రీనగర్‌లో కేవలం 29.81% మాత్రమే పోలింగ్ కనిపించింది. ఈ తేడాలు ఓటర్ల వైఖరిలో భిన్నాభిప్రాయాలకు దర్పణం పడుతున్నాయి. శ్రీనగర్‌లోని ఓటర్లలో అత్యధిక శాతం మందికి అసెంబ్లీ ఎన్నికలపై విశ్వాసం కుదరడం లేదు. ఇది అధికారం లేని కాగితం బొమ్మ అని, 2019లో తామేం కోల్పోయామో అది తిరిగి ఈ అసెంబ్లీ తీసుకు రాలేదన్న నిస్పృహ కనిపించింది. ప్రాంతీయ పార్టీలన్నీ తమను మోసగించాయన్న వ్యతిరేకత బయటపడుతోంది. ఈ పరిస్థితుల్లో స్థానిక ప్రాంతీయ పార్టీలు ఈ ఎన్నికల్లో ఓటర్లను ఎంతవరకు ఆకట్టుకుంటాయి? అన్న సందేహం కలుగుతోంది. ఇలా ఉంటే ఎన్నికల ఫలితాలు ఎవరికి పట్టం కడతాయో చెప్పలేం. పార్టీలన్నీ ఓటర్లను, ముఖ్యంగా యువతను ఆకర్షించడానికి తమ అజెండాలో ఎన్నో హామీలను ఎప్పటికప్పుడు చేర్చుకుంటున్నాయి. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి), పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ (పిడిపి)లు ఈ రెండూ తిరిగి జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా, ఆర్టికల్ 370, 35ఎను తిరిగి తీసుకువస్తామని, జైలు పాలైన యువతను విడిపిస్తామని, వారిపై కేసులను ఉపసంహరిస్తామని ఒకే విధమైన హామీలు ఇస్తున్నాయి. అంతేకాదు నేరం చేయకపోయినా విచారణ లేకుండా నిర్బంధించడానికి ఉపయోగించే పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ (పిఎస్ఎ)ను రద్దు చేస్తామని, వేర్పాటువాదులకు, మిలిటెంట్లకు సహాయ పడుతున్నారనే నెపంతో స్థానికులను నిర్బంధించడానికి ఉపయోగించే ప్రివెన్షన్ యాక్ట్‌ను ఎత్తివేస్తామని హామీలు ఇస్తున్నాయి. ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్నారనే అనుమానంతో వందలాది మంది ప్రభుత్వ ఉద్యోగులను గతంలో తొలగించారు. ఆ వివాదాన్ని పరిశీలించి తిరిగి వారిని నియమిస్తామని ఈ రెండు పార్టీలు హామీ ఇస్తున్నాయి. పోలీస్‌లు ఇచ్చిన వ్యతిరేక నివేదికల ఆధారంగా ఇదివరకు స్థానికులకు పాస్ పోర్టులు, ఉద్యోగాలు తిరస్కరించేవారు. అలాంటివి జరగకుండా చూస్తామని పార్టీలు భరోసా ఇస్తున్నాయి. రాష్ట్ర హోదా, పాకిస్థాన్‌తో తిరిగి చర్చలు ప్రారంభించడం అన్నవి కూడా ప్రాంతీయ పార్టీల ఎజెండాలో ప్రధానాంశాలుగా చోటుచేసుకున్నాయి. రాష్ట్రహోదా హామీ పై అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నా బిజెపి మాత్రం దానికి కట్టుబడి లేదు. ప్రత్యేక హోదా, ఆర్టికల్ 370 ను పునరుద్ధరించడానికి బిజెపి ఒప్పుకోవడం లేదు. దీన్ని కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలపై వ్యతిరేక అస్త్రంగా బిజెపి ప్రయోగిస్తోంది. అలా చేస్తే భారత్ లో మిగతా ప్రాంతంతో కశ్మీర్‌కు సంబంధం లేకుండా పరాయికరణ అవుతుందని హెచ్చరిస్తోంది. బిజెపి తన అజెండాను గెలవడానికి ప్రధాని నరేంద్ర మోడీని, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ వంటి జాతీయ నాయకులను ప్రచార రంగంలోకి దింపింది. దేశంలో మరెక్కడా లేని విధంగా బిజెపి తన సమీకరణ వ్యూహాన్ని కశ్మీర్‌లోనే కేంద్రీకరిస్తోంది. అయినా ఈసారి అగ్నిపరీక్షను ఎదుర్కొంటోంది. నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తు కుదుర్చుకున్న కాంగ్రెస్, ప్రత్యేక హోదా విషయంలో ఆచితూచి అడుగువేయక తప్పడం లేదు. కశ్మీర్ విషయంలో కేంద్రం వైఖరిని పదేపదే తూర్పారపట్టే రాహుల్ గాంధీ ఆర్టికల్ 370 విషయం వచ్చేసరికి మౌనం పాటిస్తున్నారు. మరోవైపు లెఫ్టినెంట్ గవర్నర్ బిజెపి కీలుబొమ్మ అని, గవర్నర్ ద్వారా కశ్మీర్ పాలనాధికారాన్ని కేంద్రం అధీనంలో ఉంచుకోవడానికి, స్థానిక రాజకీయ నాయకత్వాన్ని బలహీనం చేయడానికి బిజెపి పన్నాగాలు పన్నుతోందని రాహుల్ ఆరోపిస్తున్నారు. ఇక బిజెపి, కాంగ్రెస్ అజెండాకు, పాకిస్థాన్‌కు మధ్య సంబంధాన్ని అంటగడుతోంది. ఈ ఎన్నికల రంగం పార్టీల తీవ్ర సంఘర్షణగా మారింది. ఇదిలా ఉండగా ఈ ఎన్నికల రెండో దశ పోలింగ్‌ను సందర్శించడానికి 15 మంది విదేశీ ప్రతినిధుల బృందం రావడం దేనికోసం అన్న విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రతినిధుల సందర్శన అంతా ముందుగా మార్గదర్శకం చేసిన కార్యక్రమంగా ఆరోపించాయి. వీరితోపాటు విదేశీ జర్నలిస్టులను ఎందుకు ఆహ్వానించ లేదు అని ప్రశ్నిస్తున్నాయి.

# చిన్నారుల మెదళ్లలో మతబీజాలు



భారత దేశాన్ని పరిపాలించిన మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు తన గురువుకి రాసిన ఉత్తరంలో విషయం ఇలా ఉంది "నాకు అత్యవసరమని భావించి మీరు నాకు అరబ్బీ భాష నేర్పారు. దాని వల్ల అటు మీకూ, ఇటు నాకూ చాలా సంవత్సరాలు వృథా అయ్యాయి. ఎదుగుతున్న లేత వయసులో విద్యార్థి బుద్ధిని తేజోమయం చేయాలి గాని, మీరు నన్ను మందబుద్ధిని చేశారు. జీవితంలో ఎక్కడా ఎందుకూ ఉపయోగపడని భాష నేర్పడానికి మీరు నా జీవితంలోని విలువైన పది, పన్నెండేళ్లు వృథా చేశారు. ఆ ఒక్క భాష, అందులోని సంప్రదాయ రచనలు, అల్లాహ్ స్మరణ మాత్రమే నన్ను లోక జ్ఞానిగా, మేధో సంపన్నుడిగా చేస్తాయని మీరు ఎట్లా అనుకున్నారూ? ఉపయోగపడే విద్యను పిల్లలకు నేర్పించాల్సి ఉంటుంది. వారి అభిరుచికి తగిన విధంగా జ్ఞానాన్ని అందించాల్సి ఉంటుంది.ఐకాగా, మీరు నా బాల్యాన్ని సర్వనాశనం చేశారు కదా? భూగోళ శాస్త్రం తెలియదు. గణితం తెలియదు. చరిత్ర తెలియదు. ఇంగ్లాండు, హాలెండ్, పోలెండ్, పోర్చుగీస్ వంటి దేశాలు ఉన్నాయని మీరు నాకు చెప్పలేదు. దేశమంటే ఏమిటో, ద్వీపమంటే ఏమిటో, ద్వీప కల్పమంటే ఏమిటో మీరు నాకు చెప్పనే లేదు. సముద్ర మట్టమంటే ఏమిటో, సముద్ర మట్టానికి ఏ దేశం, ఎంత ఎత్తున ఉందో తెలియదు. ఈ హిందూస్థాన్ బాదుషా పేరు వింటేనే ప్రపంచ దేశాల రాజులందరూ గడగడ వణికిపోతారని అబద్ధాలు చెప్పారు కదా? అబద్ధాలతో ఎవరైనా జ్ఞాన సముపార్జన చేయగలరా? ప్రపంచంలోని వేరు వేరు రాజ్యాలేవీ? వారి పాలకులెవరు? అక్కడి ఆచార వ్యవహారాలు, ఆహార నియమాలు ఎలాంటివీ? సంపత్తి గల దేశాలేవీ? విపత్తులు ఎదుర్కొన్న రాజ్యాలేవీ మాట వరుసకైనా చెప్పలేదే? ఇక మాకు విషయాలు ఎలా తెలుస్తాయి? ప్రపంచంలో మన దేశం ఎక్కడ ఉంది? దీని బలాబలాలేమిటీ? వనరులేమిటీ? శక్తిసామర్థ్యాలేమిటీ? వంటి విషయాలు అంచనా వేసుకోవాలంటే చుట్టూ ఉన్న దేశాల పరిస్థితిని అర్థం చేసుకోవాలి కదా? చక్రవర్తి కుమారులమైన మాకు విషయాలు తెలియాల్సిన వయసులో తెలియకపోతే ఎలా? దేశాన్ని సమర్థవంతంగా ఎలా పరిపాలించగలం?" అని మదనపడ్డాడు ఔరంగజేబు. ఈ ఉత్తరంలో చాలా వాస్తవాలున్నాయి. ఒక భాషను బోధించడం, తర్వాత మత బోధలు చేయడం తప్ప ప్రపంచ పరిజ్ఞానానికి ప్రాధాన్యతే ఇవ్వలేదు. అతను మొఘల్ చక్రవర్తి వారసుడు గనక, అరబ్బీ నేర్పించారు. దాని ద్వారా అల్లాను పరిచయం చేశారు. దాంతో మతానికి పునాదులు వేశారు. ఆ సమయంలో హిందూ కుటుంబాలలో కూడా దాదాపు అదే జరిగేది. ఆ కుటుంబాలలో సంస్కృతం నేర్పేవారు. వేదాలు, పురాణాలు చదివించి, మతంలోకి దారి చూపించేవారు. ఇంకా ఇతర మతాల్లోనూ అలానే జరిగేది. దాన్నే పాండిత్యంగా ప్రకటించుకునేవారు. ఈ విషయాన్ని పక్కన పెట్టి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ బాల్య అనుభవాల్ని చూద్దాం జర్మనీ మ్యూనిచ్ నగరంలోని ఒక కేథలిక్ స్కూల్లో చదువుకున్న ఐన్‌స్టీన్ అక్కడి మత బోధనలకు, వారి పద్ధతులకు విసిగి తర్వాత కాలంలో ఇలా రాసుకున్నారు. "నాకు పన్నెండో యేట నుండి పాఠశాల మీద, ఉపాధ్యాయుల మీద అపనమ్మకం ప్రారంభమైంది. స్కూలు నన్ను ఫెయిల్ చేసింది. నేను స్కూలును ఉపాధ్యాయులెప్పుడూ మిలిట్రీ సార్జంట్లలాగా ప్రవర్తించే వారు. నాకు కావాల్సింది నన్ను నేర్చుకోనిచ్చేవారు కాదు. నా జ్ఞాన తృష్ణను ఉపాధ్యాయులు మెలిక వేసి తిప్పుతుండేవారు. ప్రభువు ప్రార్థనలు ఎంత సేపనీ?" అంటూ విసుక్కున్నాడు. ఇంగ్లీషు కవి డబ్లు.బి. ఈట్స్ అంటాడు "విద్య నేర్పడం అంటే, బకెట్ నింపడం కాదు అగ్నిని రగిలించడం!" అని! ఈ గురువులు విద్య పేరుతో దైవభావనకీ, మత బోధనలకూ ప్రాధాన్యమిచ్చారే గాని, జ్ఞానబోధ చేసింది ఎక్కడ? బకెట్లు నింపడమే గాని అగ్ని రగిలించిందెక్కడ? సమాజం లో అభ్యుదయ భావనలు చోటు చేసుకున్న దశలో ఉపాధ్యాయుడి నిర్వచనం మారింది. ఉపాధ్యాయుడంటే స్నేహితుడు, మార్గదర్శకుడు, ప్రణాళికా నిపుణుడు, క్రమశిక్షణ నేర్పేవాడు. స్ఫూర్తి కలిగించే వాడు, తరగతి నిర్వహించేవాడు, వ్యక్తీకరించే నేర్పుగలవాడు, ఆ నేర్పు నేర్పించేవాడు, కౌన్సిలింగ్ చేసేవాడు, పరీక్ష నిర్వహణాధికారి, సృజనకారుడు, తత్వవేత్త, తండ్రిలాంటి వాడు, వసతులు కల్పించేవాడు, బోధకుడు, కౌన్సిలింగ్ నిర్వాహకుడు వగైరా. గతంలో బోధించేవారిని 'గురువు' అని అనేవారు. గురువు మత బోధలు చేసేవాడు. ముక్తి మార్గం చూపేవాడు. రాను రాను గురువుల అవసరం తగ్గిపోయింది. ప్రపంచ జ్ఞానాన్ని, విశ్వ రహస్యాల్ని విప్పి చెప్పే ఉపాధ్యాయుల అవసరం ఎక్కువైంది. అందుకే అన్నారు 'వేయి మంది పూజారు (గురువు)ల కన్నా, బాధ్యత గల ఒక ఉపాధ్యాయుడు మిన్న' అని! పిల్లలకు ఇంగ్లీషు, జర్మనీ, ఫ్రెంచ్ వంటి భాషలు నేర్పించే దేశాల్లో ఆయా భాషల ద్వారా మత బోధలు కొనసాగించారు. వందల ఏళ్లు అదే ధోరణి నడిచింది. అదే జీవిత పరమార్థం అనుకున్నారు. తర్వాత కాలంలో తప్పని సరై గణితం, చరిత్ర, భూగోళం పిల్లలకు చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. సమాజం ఆధునిక యుగంలోకి ప్రవేశిస్తున్న కొద్దీ సైన్సు ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. గతాన్నంతా దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడు ఈ అత్యాధునిక యుగంలో నిలబడి ఆలోచిద్దాం. ఇప్పుడు కూడా ఓ భాష నేర్చుకుని, దాంట్లోంచి మత బోధలు వంట బట్టించుకుని, మంద బుద్ధులై ఉందామా? లేక నేటి జీవితంలో ఏ ఉపయోగమూ లేని మత బోధలు పక్కన పెట్టి, ఆధునిక విజ్ఞానాన్ని ఆహ్వానిద్దామా? ఆ నాటి ఔరంగజేబు చక్రవర్తే తనకు సరైన విద్య అందించలేదని తన గురువును దోషిగా నిలబెట్టాడు కదా? మరి ఇప్పుడూ? విద్యా సంస్థల్లోనే కాదు, అనేకానేక మాధ్యమాల ద్వారా జ్ఞాన సముపార్జన చేసుకునే వెసులుబాటు ఉంది. ఎవరి ఊర్లో వారు కుంచించుకుని ఉండిపోవాల్సిన పరిస్థితిలోంచి విశ్వమంతా నా గ్రామమే అని అనుకునే స్థాయికి ఎదిగాం. కులమతాల్ని వదిలేసి, మతేతరులుగా జీవించగలిగే స్వేచ్ఛను సంపాదించుకున్నాం. దేవుడు శిక్ష విధిస్తాడన్న భయంతో కాక స్వచ్ఛందంగా మానవీయ విలువల్ని కాపాడుకునేంతటి వివేకవంతులమయ్యాం. మరి ఇప్పుడు ప్రశ్నించుకోవాలి మూఢత్వమా? వివేకమా? బానిస మనస్తత్వమా? స్వేచ్ఛాలోచనా? పురాణాల పాండిత్యమా? వైజ్ఞానిక అవగాహనా? ఏది? ఏది మనం కావాలనుకుంటున్నాం? "ఒక పిల్లాడు ఆపదలో ఉంటే కాపాడేవాడు మనిషి. కాపాడమని ఎవరినో ప్రార్థించేవాడు భక్తుడు. తనకేమీ సంబంధం లేదన్నట్టు ఉండేవాడు దేవుడు" మత విషయాలు బోధించి జనాన్ని 'జ్ఞానుల్ని' చేయాలని కొన్ని వర్గాలు ప్రయత్నించాయి. చాలా వరకు సఫలమయ్యాయి కూడా! మతం చెప్పింది, దేవుడు చెప్పాడు వంటి బూటకపు మాటలతో తరతరాలుగా కోట్ల మందిని బానిసల్ని చేశారు. హీనజనులుగా చూసి ఈసడించారు. ప్రపంచంలో అధిక సంఖ్యాకులైన క్రిస్టియన్లు ఈ పని ఎక్కువగా చేస్తే, ఆ తరువాత వరుసలో ఉన్న ముస్లింలు, హిందువులూ కూడా ఆ పని విజయవంతంగా కొనసాగించారు. అదే ఇప్పటికీ ఇంకా ఇంకా కొనసాగాలని భావిస్తున్నారు కూడా! జ్ఞాని అయిన వాడికి అన్ని విషయాల మీద అవగాహన ఉండదు. అజ్ఞానికి మాత్రం ఉంటుంది. ఎంతటి జ్ఞాని అయినా కొన్ని కొన్ని విషయాల మీదే అవగాహన పెంచుకుంటాడు. తెలియని విషయాలు తెలియవని ఒప్పుకుంటాడు. అదే అజ్ఞాని మాత్రం తెలియని విషయాలు తెలియవని ఒప్పుకోడు. ఇలాంటి వారు తమకు తాము బాగుపడరు. తమని బాగుపరిచే అవకాశాన్ని కూడా ఇంకొకరికి ఇవ్వరు. ఇది మతం పిచ్చిలో మునిగిన అవివేకుల లక్షణం! "అభూత కల్పనలే పరమ సత్యాలని నీ చేత నమ్మించే వాళ్లు, నీ చేత పరమ క్రూర చర్యల్ని సైతం పవిత్ర కార్యాలుగా చేయించగలరు" అని అంటాడు వోల్టేర్ ఫ్రెంచ్ రచయిత. "మనుషులు పరస్పరం ద్వేషించుకోవడానికి తగినంత మతం అనేది ఉంది. కాని ప్రేమించుకోవడానికి చాలినంతగా లేదు" అని అంటాడు ఆంగ్లో ఐరిష్ కవి, రచయిత, జోనాథన్ స్విఫ్ట్. హిందూ కుటుంబాలలో సంస్కృతం, హిందీ, తెలుగు, ఇతర ప్రాంతీయ భాషల్లో కొంచెం ప్రవేశం సంపాదించి, దైవభావనని అంగీకరిస్తే చాలు. మంచి సంప్రదాయ కుటుంబం అని గుర్తింపు దొరుకుతుంది. ఇంకా కొంచెం ముందుకు వెళ్లి నాలుగు శ్లోకాలు ఎక్కువ చదివి దేవుణ్ణి ఆరాధిస్తూ ఉంటే సమాజం అతణ్ణి 'గురువు' గా గుర్తిస్తుంది. ముస్లింల పరిస్థితి దాదాపు అలాగే ఉంది. ఖురాన్‌లో ఉన్న క్రీ.శ. 570632 నాటి విషయాలు పాటిస్తారు. మహ్మద్ ప్రవక్త చెప్పినవి అని అంటారు. అలాగే క్రిస్టియానిటీలో పాస్టర్ మాటలకు వశులైపోయి పూనకాలు పూనుతారు. కన్వరి నూనెతో రోగాలు నయమవుతాయనుకుంటారు. దేవునితో ఒక రాత్రి శృంగార దేవాలయాలు స్వస్థత ప్రార్థనలన్నీ నిజమనుకుంటారు. స్త్రీలు మోసపోతున్నారని తెలిసినా తెలివి తెచ్చుకోరు. ఈ మతాలన్నింటిలో దగ్గరి పోలికలు ఉన్నది ఎందుకంటే ఒకప్పుడు అందరూ ఒకటే కాబట్టి! భారతదేశంలోని ముస్లింలు, క్రిస్టియన్లు చాలా వరకు ఒకప్పుడు హిందువులే. ముస్లిం చక్రవర్తుల పాలన వల్ల, బ్రిటీష్ వారి పాలన వల్ల.. ఏవో లాభాలకు, రాయితీలకు ఆశపడి మతం మారిన వారే ఎక్కువ. బౌద్ధం ప్రభావం లోంచి బయటపడలేక, హిందువులు తమ దశావతారాలలో బుద్ధుణ్ణి కలిపేసుకున్నారు. ఆ తరువాత జరిగిన పరిణామాలలో బౌద్ధారామాల్ని హిందూ దేవాలయాలుగా మార్చుకోవడం, నిమ్నజాతుల జీవితాలు దుర్భరం చేయడం జరిగింది. ఫలితంగానే వారంతా ఇతర మతాల్ని స్వీకరించారు. తర్వాత కాలం లో హిందూ దేవాలయాల్ని కూలగొట్టి ముస్లిం రాజులు వాటిని మసీదులుగా మార్చుకున్నారు. చరిత్ర పుటల్లో మత ఘర్షణలన్నీ నమోదయ్యే ఉన్నాయి. అజ్ఞాన నేత్రంతో చూస్తే విషయాలు వంకర టింకరగా కనిపిస్తాయి. జ్ఞాన నేత్రంతో సమ్యక్ దృష్టితో చూస్తే వాస్తవాలేమిటో అర్థమవుతాయి. అయితే అధ్యయనాలన్నింటి సారాంశం ఒక్కటే "మతం మనిషిని మనిషిగా ఉండనీయదు" అని!

# 'మరణశిక్ష'కు మళ్లీ ప్రాణ ప్రతిష్ఠ!



దేశంలో మరణశిక్ష అంతం కావడం లేదు. ఫీనిక్స్ పక్షి బూడిద కుప్పలోంచి తిరిగి లేచి వచ్చినట్టు మరణశిక్ష అప్పుడప్పుడు పుట్టుకు వస్తోంది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అపరాజిత వుమన్ అండ్ చైల్డ్ (వెస్ట్ బెంగాల్ క్రిమినల్ లాస్ అమెండ్‌మెంట్) బిల్ 2024ను ఇటీవల తీసుకురావడమే దీనికి ఉదాహరణ. దీనికి కారణం కోల్‌కతా ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో డాక్టర్ పాశవికంగా అత్యాచారానికి, హత్యకు గురయ్యే సంఘటనే. పశ్చిమ బెంగాల్‌కు ఈ బిల్లు వర్తింప చేసేలా భారతీయ న్యాయ సంహిత 2023(బిఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023, ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్ 2012 చట్టాల్లో మార్పులు తీసుకురావలసిన అవసరం ఉంది. అత్యాచార నేరానికి మరణ శిక్ష తప్పనిసరి చేస్తూ పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించడంతో రాష్ట్ర గవర్నర్ పాత్ర కీలకమై, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదానికి పంపవలసి వచ్చింది. ఇదే విధంగా ఆగస్టు నెలలోనే అనేక రాష్ట్రాల్లో అత్యాచార బాధితులు దళితులు, ఆదివాసీ మహిళలు, చిన్నారులు అవ్వడం గమనార్హం. 2022 లోనే దేశంలో 31,516 అత్యాచార కేసులు నమోదయ్యాయి. అంటే ప్రతి గంటకు నాలుగు అత్యాచారాలు జరిగాయని చెప్పవచ్చు. వీటిలో 248 కేసులు అత్యాచారంతోపాటు హత్య/ సామూహిక అత్యాచారాలుగా నేషనల్ క్రైమ్స్ రికార్డు బ్యూరో వెల్లడించింది. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల్లో క్రమంగా 5399, 3690, 3029 వంతున ఈ కేసులు టాప్‌లో ఉన్నాయి. 2023 అంతానికి ప్రపంచంలో మూడొంతుల దేశాలు మరణశిక్ష విధించడాన్ని రద్దు చేశాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక వెల్లడించింది. 112 దేశాలు పూర్తిగా మరణశిక్షను రద్దు చేసేశాయి. 144 దేశాలు తమ చట్టం లోను, ఆచరణ లోను మరణశిక్షను ఉపసంహరించుకున్నాయి. 55 దేశాలు ఇంకా మరణశిక్షను విధిస్తున్నాయి. దక్షిణాసియాలో భూటాన్, నేపాల్ దేశాలు అన్ని నేరాలకు మరణ శిక్షను నిర్మూలించగా, మాల్దీవులు, శ్రీలంక దేశాలు మాత్రం ఆచరించడం లేదు. భారత్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, మరణశిక్షను అమలు చేస్తున్నాయి. 2023 లో భారత్ 120 మరణ శిక్షలను అమలు చేసిందని ప్రాజెక్టు 39 ఎ వెల్లడించింది. 2022లో కూడా 167 వరకు భారత్‌లో మరణశిక్షలు అమలయ్యాయి. 2023 ఆఖరి నాటికి భారత్‌లో మొత్తం 561 మంది మరణశిక్షకు గురయ్యారు. 2019 లో 378 మరణశిక్షలు అమలు కాగా, అప్పటి నుంచి క్రమంగా ఈ సంఖ్య పెరుగుతూ వచ్చింది. మరణశిక్ష విధింపబడిన వారు చాలా సంవత్సరాలు శిక్ష అమలు కోసం నిరీక్షించడం, వీరిలో చాలా మంది తరువాత నిర్దోషులు కావడం వంటి ఉదంతాలు ఉన్నాయి. అలాంటివారిలో కొందరు మానసికంగా, భౌతికంగా, అనారోగ్య సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ, వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం లభించలేదు. జైళ్లలో వ్యవస్థాపరమైన లోపాలతో కులమత వర్గ వివక్ష వంటి అమానవీయ పరిస్థితులతో కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. బలహీన వర్గాలకు చెందిన విచారణ ఖైదీలు తమను తాము రక్షించుకోలేకపోతున్నారు. దేశంలోని ఖైదీల్లో మూడింట నాలుగొంతుల మంది ఇలాగే జైళ్లలో మగ్గుతున్నారు. ఇండియన్ పీనల్ కోడ్‌కు బదులుగా భారతీయ న్యాయ సంహిత అమలులోకి వచ్చినా, మరణశిక్ష విధించాల్సిన నేరాల సంఖ్య మాత్రం 12 నుంచి 18 కి పెరగడం గమనార్హం. హత్యతో కూడిన లైంగిక నేరాలకు 2023లో సెషన్స్ కోర్టులు మరణశిక్షలనే విధించాయి. మహిళలు, చిన్నారులపై లైంగిక నేరాల్లో బాధితులు హత్యకు గురైతే తరచుగా ప్రజాగ్రహం పెల్లుబకడమే కాదు, చివరకు నిందితులకు మరణశిక్ష విధించాలన్న డిమాండ్ కొన్ని వర్గాల నుంచి ఎక్కువగా వస్తోంది. దేశ మత, సాంఘిక సంస్కృతిలో 'సంహారం' అన్నది ఒక భాగంగా పాతుకుపోయింది. ఉదాహరణకు దేవతలు దుష్టశక్తులను సంహరించడం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. అదే బాధితులకు సరైన న్యాయం అన్నది 'ధర్మం'గా భావించబడుతోంది. న్యాయ వ్యవస్థలోనూ ఇది ప్రతిబింబిస్తోంది. కొన్ని చోట్ల నిందితులకు అక్కడి సమాజాలే మరణ శిక్షలు విధిస్తున్నాయి. అయితే ఇలాంటివి వెలుగులోకి రావడంలేదు. గృహహింస నేరాలే కాదు, అపరిచితుల నుంచి కూడా మహిళలకు లైంగిక దాడులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మరోవైపు సామూహిక అత్యాచారాలతో సహా లైంగిక నేరాలను నిరోధించడానికి మరణశిక్ష అంతగా అవసరమైన చర్య కాదని జస్టిస్ వర్మ కమిటీ సిఫార్సులు చేయడం ఆలోచించాల్సిందే.